## పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం




PCW తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పది




Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 02 సంచిక - 146 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శనివారం 24 మే 2025

# ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అందరినీ కలుపుకుని పోతా...

- ☛రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధానిని కలుస్తూనే ఉంటా..☛కెసిఆర్ తన 40 ఏళ్ల అనుభవాన్ని అభివృద్ధికి కేటాయించాలి
- ☛నిమ్జ్ భూ బాధితులకు న్యాయం చేస్తాం☛వారికి పరిహారం న్యాయయం చేసే బాధ్యత జగ్గారెడ్డిదే
- ☛జహీరాబాద్ పర్యటనలో సిఎం రేవంత్ రెడ్డి



**సంగారెడ్డి,మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** ఎన్నికలప్పుడే రాజకీయాలు అని.. తర్వాత అందరినీ కలుపుకుని ముందుకెళ్తామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని తెలిపారు. ఎన్నిసార్లయినా ప్రధాని మోదీని కలుస్తామని.. తెలంగాణకు అవసరమైన నిధులు తీసుకొస్తామని వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరస్పర సహకారంతోనే అభివృద్ధి సాధ్యమని ముఖ్యమంత్రి అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా శుక్రవారం జహీరాబాద్ హుగ్గెల్లిలో బసవేశ్వర విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. ఆపై కేంద్రీయ విద్యాలయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ పాల్గొన్నారు. అనంతరం పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. జహీరాబాద్ పారిశ్రామికవాడ భూసేకరణలో అన్యాయం జరిగిందని తన దృష్టికి వచ్చిందన్నారు. భూములు ఇచ్చిన రైతులకు పరిహారం పెంచామని.. జహీరాబాద్ నిమ్జ్‌లో భూములు కోల్పోయిన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని... నిమ్జ్‌లో భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు వివరాలు 2లో

# ఆపరేషన్ సిందూర్‌తో గట్టి జవాబిచ్చాం

☛ప్రపంచానికి మన సత్తాను చాటగలిగాం☛ఉగ్రవాదాన్ని సహించే ప్రసక్తి లేదు☛ఢిల్లీలో బిఎస్ఎఫ్ కార్యక్రమంలో అమిత్ షా



**న్యూఢిల్లీ,మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్‌కు బుద్ధి చెప్పడమే గాకుండా, భారత సైనిక శక్తి పాటవాన్ని ప్రపంచానికి తెలియ చేశామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కీలక వ్యాఖ్యలు చేశారుదేశ రాజధానిలో జరిగిన 22వ బీఎస్ఎఫ్ పదవి పురస్కార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్'ను ప్రశంసించారు. ఈ ఆపరేషన్‌లో భారత సైన్యం, బీఎస్ఎఫ్, ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు అద్భుతంగా పనిచేశాయని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో ఆపరేషన్ విజయవంతమైందన్నారు. గతంలో పాకిస్థాన్ ఆధ్వర్యంలో జరిగిన దాడులకు ఆయా ప్రభుత్వాలు తగిన సమాధానం ఇవ్వలేదని అమిత్ షా విమర్శించారు. కానీ 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పరిస్థితి మారిందన్నారు. ఉగ్రవాద దాడులకు గట్టి సమాధానం ఇవ్వడమే కాదు, భారత్ అంటే ప్రపంచానికి తెలిసేలా చేశామన్నారు. 2014లో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, ఉరీలో జరిగిన దాడి దేశాన్ని కలచివేసింది. ఈ దాడిలో భారత సైనికులను ఉగ్రవాదులు దారుణంగా హతమార్చారు. దీనికి సమాధానంగా భారత సైన్యం మొదటిసారిగా శత్రు భూభాగంలోకి చొచ్చుకెళ్లి సర్జికల్ స్ట్రయిక్ నిర్వహించింది. ఈ ఆపరేషన్ ద్వారా పాకిస్థాన్ వివరాలు 2లో

# మళ్లీ జడలు విప్పుతున్న కరోనా

☛ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కేసుల నమోదు ☛అప్రమత్తంగా ఉండాలని వైద్యుల హెచ్చరిక



**హైదరాబాద్,మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** యావత్ ప్రపంచాన్నీ వైరస్‌తో వణికించిన కరోనా మహమ్మారి మళ్లీ జడలు విప్పుతోన్న సూచనలు కనిపిస్తున్నాయి. దేశంలో గత నాలుగు రోజులుగా అక్కడక్కడా కరోనా మాట వినిపిస్తున్న సంగతి తెలిసిందే. తెలుగు రాష్ట్రాల్లో కరోనా పాజిటివ్ కేసులు నమోదు అవుతున్నాయి. అయితే, తాజాగా తెలంగాణలో కరోనా కేసు నమోదు నమోదైంది. హైదరాబాద్ కూకట్‌పల్లిలో ఒక డాక్టర్‌కు కరోనా పాజిటివ్ నిర్ధారణ అయింది. దీంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపోతే కడపలో కరోనా పాజిటివ్ కేసు నమోదు అయ్యింది. నంద్యాల జిల్లా చాగలమర్రికి చెందిన 75 ఏళ్ల మహిళ అనారోగ్యంతో రెండు రోజుల క్రితం కడప రిమ్స్‌లో చేరింది. వృద్ధురాలికి తీవ్ర జ్వరం ఉండటంతో అనుమానించిన వైద్యులు వివరాలు 2లో

# కవిత లేఖపై స్పందించాల్సిన అసవరం లేదు

- ☛డాడీ..డాటర్ వ్యవహారంతో మాకేం పని
- ☛కుటుంబ పార్టీలతో దేశానికి నష్టం: కిషన్ రెడ్డి



**హైదరాబాద్,23(పీసీడబ్ల్యూ న్యూస్):** కెసిఆర్‌కు ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖ పూర్తి అంతర్గత విషయం అని.. దానికి అంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం లేదని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బిఆర్ఎస్ పార్టీ ఓ మునిగిపోతున్న నావ అని అన్న ఆయన.. అలాంటి పార్టీలో ఇలాంటి ఘటనలు జరగడం మామూలే అని పేర్కొన్నారు. డాడీ–డాటర్ ఉత్తరం ఓ డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత ఎందుకు ఉత్తరం రాశారు తనకు తెలియదని.. కానీ, కెసిఆర్, కవితల మధ్య మాటలు లేవని ఉత్తరం ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. కుటుంబ పార్టీలు దేశానికి ప్రమాదకరమని అన్నారు. కెసిఆర్ సొంతపార్టీ ఎమ్మెల్యేలనే దగ్గరకు రానివ్వరని కిషన్ రెడ్డి తెలిపారు. 14 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉన్న తనకే అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని పేర్కొన్నారు. కేంద్రమంత్రి వివరాలు 2లో



# హెరాల్డ్ కేసులో రేవంత్ పేరు ప్రస్తావన

### - రేవంత్ బండారం బట్టబయలైందన్న కెటిఆర్

**హైదరాబాద్,23(పీసీడబ్ల్యూ న్యూస్):** నేషనల్ హెరాల్డ్ కేసులో రేవంత్ రెడ్డి పేరును ఇడి ప్రస్తావించడంతో సిఎం అవినీతి బండారం మొత్తం బయటపడిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎక్స్ వేదికగా విమర్శించారు. యంగ్ ఇం డియా సంస్థకు విరాళాలు ఇస్తే పదవులు వివరాలు 2లో

# మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- కాల్పులు విరమించాలి
- అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడు సోదా రామకృష్ణ



**హైదరాబాద్, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రత్యేక ప్రతినిధి):** ఒకవైపు ప్రజా సంఘాలు నక్సలైట్లపై చేపట్టిన ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని, గొంతేత్తు తున్నాయని చర్చల మాట నేమో గాని దట్టమైన అడవుల్లో నక్సలైట్లపై తూటాలు పేలుతున్నాయని సోదా రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్రం ప్రజల కోసం పోరుబట్టిన పోరాటయోధులను బలి తీసుకోకుండా జనజీవన స్రవంతిలోకి వచ్చేలా చర్యలకు పూనుకోవాలని కోరారు. అనాదిగా దొరల పాలనలో అణగారిన వర్గాల పీడిత ప్రజలు పొట్టకూటికోసం పోతుండే వారని అన్నారు. అలాంటి దుర్భర పరిస్థితుల్లో నక్సల్స్ బరి మేమున్నాము అంటూ ఆ పీడిత జనాన్ని అక్కున చేర్చుకుందని తెలిపారు. వారిని కూడా జనం తల్లి కోడి పిల్లల రక్షణ కోసం రెక్కల మాటున దాచి పెట్టుకున్నట్లుగా జనం వారికి రక్షణ కల్పించారనేది బహిరంగ రహస్యమని అన్నారు. కాగా కేంద్రం నక్సల్స్‌తో మధ్య వర్తిత్వం ద్వారా శాంతి చర్చలు జరిపి రక్తపు టేరుల ప్రవాహాన్ని నివారించాలని ఆదివాసులకు ప్రశాంతత వాతావరణంలో జీవించేలా చర్యలు చేపట్టాలని అఖిల భారతీయ సఫాయి మజ్దూర్ కాంగ్రెస్ ట్రేడ్ యూనియన్ జాతీయ ఉపాధ్యక్షులు సోదా రామకృష్ణ కోరారు ఆయనతోపాటు పరకాల మాజీ కౌన్సిలర్ సంతోష్ పాల్గొన్నారు.

# అవును నేనే లేఖ రాసా...

- అయినా అది ఎలా లీకయ్యిందన్నదే ప్రశ్న
- కెసిఆర్ దేవుడు...ఆయన చుట్టూ దయ్యాలు ఉన్నాయి
- ఉన్న విషయాలనే లేఖ ద్వారా తెలియ చేశా
- ఎమ్మెల్సీ కవిత సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్,మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు లేఖ రాయడంపై ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పందించారు. కేసీఆర్‌కు తాను లేఖ రాశానని చెప్పారు. రెండు వారాల క్రితమే తాను లేఖ రాశానని.. ఆ లేఖ ఎలా లీక్ అయ్యిందో తనకు అర్థం కావడం లేదన్నారు. అమెరికా నుంచి హైదరాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కవితను మీడియా ప్రతినిధులు లేఖ అంశంపై ప్రశ్నించారు. దీనికి స్పందించిన కవిత.. నిజమే ఆ లేఖ తానే రాశా నని స్పష్టం చేశారు. ఇదే సమయంలో కొన్ని సంచలన కామెంట్స్ చేశారామె. నేను కేసీఆర్‌కు లేఖ రాశాను. రెండు వారాల క్రితమే కేసీఆర్‌కు లేఖ రాశాను. నా అభిప్రాయాలను లేఖ ద్వారా తెలియజేశాను. కేసీఆర్‌కు రాసిన లేఖ ఎలా లీక్ అయిందో తెలియడం లేదు. కేసీఆర్ దేవుడు.. కేసీఆర్ చుట్టూ దెయ్యాలు ఉన్నాయి. కేసీఆర్‌కు నేను రాసిన లేఖ బయటకు వస్తే.. పార్టీలో ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటీ–. కేసీఆరే మా నాయకుడు. కేసీఆర్ వివరాలు 2లో

## ఎఫ్‌సిఐ తెలంగాణ రాష్ట్ర కాన్సులేటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా డికె అరుణ

## కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా: కోమటిరెడ్డి

# ఆపరేషన్ సిందూర్‌తో గట్టి జవాబిచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

ఉగ్రవాద శిబిరాలను భారత్ ధ్వంసం చేసింది. ఈ సర్జికల్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా భారత సైన్యం శక్తిని చాటిచెప్పింది. ఉరీ దాడి తర్వాత, 2019లో పుల్వామాలో మరో దాడి జరిగింది. ఈ దాడిలో 40 మంది సీఆర్పీఎఫ్ జవాన్ల ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనకు సమాధానంగా భారత వైమానిక దళం ఎయిర్ స్ట్రయిక్ నిర్వహించి, పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసింది. ఈ ఆపరేషన్ ద్వారా భారత్.. సాయుధ బలగాల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించిందన్నారు. పహల్గామ్ దాడి తరవాత తగిన గుణపాఠం చెబుతామని ప్రదాని బీహార్‌లో ప్రకటించారని, అందుకు అనుగుణంగానే ఉగ్ర శిబిరాలపై దాడి చేశామని అన్నారు. కానీ పాక్ మాత్రం జనావాసాలు, విమాన స్థావరాలపై దాడులకు తెగించిందని అన్నారు. వాటిని మన రక్షణ దళాలలు సమర్థంగా తిప్పికొట్టడమే గాకుండా పాక్ కోలుకోలేని విధంగా జవాబిచ్చామని అమిత్ షా అన్నారు.

## రూ.200 కోట్లు విలువ చేసే స్థలం కబ్జా

**హైదరాబాద్,మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** జూబ్లీహిల్స్‌లో దాదాపు రూ.200 కోట్లు విలువ చేసే రెండెకరాల పార్క్ స్థలాన్ని ఆక్రమణదారుల చెర నుంచి హైడ్రా విడిపించింది. ప్రభుత్వ స్థలాలన్ని కబ్జాచేయడమే గాకుండా తనదే స్థలం అంటూ సుప్రీం దాకా వెళ్లగా కోర్టు దానిని తిరస్కరించింది.దీంతో హైడ్రా రంగప్రవేశం చేసి స్థలంలో ఉన్న కట్టడాలను కూల్చేసి దానిని కాపాడింది. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 41 పెద్దమ్మగుడి సమీపంలో నాలాతో పాటు పార్క్ రహదారిని ఆక్రమించి నిర్మించిన భవనాలను హైడ్రా సిబ్బంది శుక్రవారం నేలమట్టం చేసింది. ఇంటిని అద్దెకు తీసుకొని ఆ ఇంటి యజమానికి తెలియకుండా చుట్టూ ఉన్న ప్రభుత్వ, ప్రజా వసరాల కోసం ఉద్దేశించిన స్థలాలను ఆక్రమించిన కబ్జా దారుడు.. హోటల్, హాస్టల్‌కు అద్దెక్కిచ్చి నెలకు రూ.10లక్షలు వసూలు చేస్తున్నాడు. ఈ విషయంపై హైడ్రాకు ఇంటి యజ మాని ఫిర్యాదు చేయడంతో స్పందించిన హైడ్రా.. గతంలోనే కిరాయిదారుడికి నోటీసులు ఇచ్చింది. సదరు కిరాయిదారుడు సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. ఆ నిర్మాణాలపై ఎలాంటి హక్కు లేదని.. రోడ్డు, నాలాను ఆక్రమించి భవనాలు ఎలా నిర్మిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. నాలాతో పాటు రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను వెంటనే తొలగించాలని ఆదేశించడంతో హైడ్రా రంగంలోకి దిగింది. దీంతో శుక్రవారం బుల్డోజర్లతో విరుచుకుపడి వాటిని నేలమట్టం చేసింది. ఆ ప్రదేశంలో జీహెచ్ఎంసీ చక్కటి పార్క్‌ను ఏర్పాటు- చేయనున్నట్టు- హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైడ్రా చర్యలను స్థానికులు అభినందించారు. ప్రభుత్వభూమిని కాపాడారని కొనియాడారు. ఈ కూల్చివేతల సందర్భంగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

## కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా: కోమటిరెడ్డి

**హైదరాబాద్,మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆర్టిఫిషియల్ లేఖను కూడా సరిగా రాయలేక పోయారని మంత్రి కోమటిరెడ్డి వెంకట రెడ్డి విమర్శించారు. లేఖకు, ఎమ్మెల్సీ కవితకు సంబంధమే లేదని కోమటిరెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు కలిసి కవిత పేరుతో లేఖ రాశారని అన్నారు. కోమటి రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. లెటర్ ఆలోచన ఎలా వచ్చిందో, ఎక్కడ ప్లాన్ వేశారో తనకంతా తెలుసునని చెప్పారు. 20 లేదా 30 సీట్లలోనే బిఆర్ఎస్ పోటీ చేస్తుందని, బిఆర్ఎస్ వచ్చే ఎన్నికల్లో బిజెపితో కలుస్తుందని జోస్యం చెప్పారు. వందేళ్లయినా కెసిఆర్ కుటుంబం కలిసే ఉంటుందని, కెసిఆర్ కుటుంబంలో కలహాలు అనేది పెద్ద డ్రామా అని ఎద్దేవా చేశారు. కవిత గురించి ఆలోచించే సమయం తనకే లేదని, ఇక మా సిఎం రేవంత్ రెడ్డికి ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. వరంగల్ లో కెసిఆర్ పెట్టిన సభ తాను ఒక్కడినే పెట్టగలనని కోమటి రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## ఎఫ్‌సిఐ తెలంగాణ రాష్ట్ర కాన్సులేటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా డికె అరుణ

**హైదరాబాద్,మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** మహబూబ్‌నగర్ లోక్‌సభ సభ్యురాలు, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణకు కేంద్ర ప్రభుత్వం కీలక బాధ్యతలు అప్పగించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సిఐ) తెలంగాణ రాష్ట్ర కాన్సులేటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా ఆమెను కేంద్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు పార్లమెంట్ వ్యవహారాల శాఖ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నియామకం ద్వారా రాష్ట్రంలో ఆహార ధాన్యాల సేకరణ, నిల్వ, పంపిణీ, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్ సమర్థవంతంగా అమలు చేయడంలో డీకే అరుణ కీలక పాత్ర పోషిస్తారు. ఈ కమిటీ రైతులు, వినియోగదారుల హితాలను కాపాడటంతో పాటు తనిఖీలు నిర్వహిస్తూ, ఆహార ధాన్యాల నాణ్యత, నిల్వ సామర్థ్యం, రవాణా వంటి అంశాలపై సలహాలు ఇస్తుందని ప్రభుత్వం వెల్లడించింది. కాగా తనకు ఈ అవకాశం కల్పించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఎంపీ డీకే అరుణ కృతజ్ఞతలు తెలిపారు. 'రైతులు, పేద ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడం నా లక్ష్యం. ఈ బాధ్యత ద్వారా తెలంగాణలో ఆహార భద్రతను బలోపేతం చేయడానికి పూర్తి స్థాయిలో కృషి చేస్తా'నని ఆమె పేర్కొన్నారు. కాగా డీకే అరుణ స్వస్థలమైన గద్వాల పట్టణంలో ఈ నియామకం సందర్భంగా ఆమె అభిమానులు, బీజేపీ కార్యకర్తలు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. డీకే అరుణ నాయకత్వంలో తెలంగాణలో ఆహార ధాన్యాల నిర్వహణ, సమర్థవంతంగా ఉంటుందని విశ్వసిస్తున్నామని వారు పేర్కొన్నారు.

# ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అందరినీ కలుపుకుని పోతా...

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించారు. మెదక్ జిల్లా పేరు చెబితేనే ఇందిరమ్మ గుర్తొస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. మెదక్ ప్రజలను కాంగ్రెస్ ఎల్లప్పుడూ గుర్తుపెట్టు కుంటుందన్నారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ కావాలని కృషి చేశామని తెలిపారు. జహీరాబాద్‌కు అవసరమైన నిధులు మంజూరు చేస్తామన్నారు. నారాయణఖేడ్ అభివృద్ధిపై ప్రత్యేకంగా సమీక్ష చేస్తామన్నారు. భవిష్యత్‌లోనూ మెదక్‌లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. సింగూరు ప్రాజెక్ట్‌ను ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతామన్నారు. సింగూరును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిధులు ఇస్తామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులను అప్పులబాధ నుంచి తప్పించామని.. రైతు భరోసా పథకం అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. గతంలో వరి వేస్తే ఉరే అన్నారని గుర్తుచేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామన్నారు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కోసం రూ.5 వేల కోట్లకు పైగా కేటాయించామని చెప్పారు. కోటి మంది మహిళలను కోటీ-శ్వరులను చేసేందుకు కంకణం కట్టు-కున్నామని స్పష్టం చేశారు. ఆడబిడ్డను ఆర్థికంగా నిలబెట్టేందుకు కృషి చేస్తున్నామన్నారు.ఆడబిడ్డ ఆర్థికంగా నిలబడితే కుటుంబాలు బాగుపడతాయని తెలిపారు. ఐదేళ్లలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామన్నారు. మీరు అండగా ఉండండి... ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసే బాధ్యత నాదని సిఎం రేవంత్ వెల్లడించారు. గత ప్రభుత్వ నేత అలిగి ఫామ్‌హౌస్‌లో పడుకున్నారంటూ విమర్శించారు. అభివృద్ధి కోసం కేంద్రంతో కలిసి పనిచేస్తామని అన్నారు. ప్రతిపక్ష నేత అసెంబ్లీకి రావాలని... సలహాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతిపక్ష రాజకీయ నాయకులు అసెంబ్లీకి రావాలని మరోసారి సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మీ 40 ఏళ్ల రాజకీయ అనుభవాన్ని మాకు చెప్పండని కోరారు. పదవి ఉంటేనే వస్తా అంటే ఎలా? అని ప్రశ్నించారు. మేము పదేళ్లు ప్రతిపక్షంలో ఉన్నామని.. ప్రతిపక్షంలో ఉంటే ప్రజల పక్షాన పోరాడాలని హితవు పలికారు. ఏ రోజు తాను సీఎంగా అహంకారానికి పోలేదని చెప్పారు. మీరు అండగా ఉంటే అద్భుతాలు చేస్తామని.. ప్రపంచంలో తెలంగాణని గొప్ప రాష్ట్రంగా తీర్చుదిద్దుతామని తెలిపారు. రైతులను అప్పుల బాధ నుంచి విముక్తి కలిగించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రైతు భరోసాని 12 వేలకు పెంచి సహాయం అందిస్తున్నామని చెప్పారు. భూమి లేని రైతులకు కూడా సహాయం అందిస్తున్నామని తెలిపారు.. వరి వేసుకుంటే ఉరే అని ఆనాటి సీఎం అన్నారని.. కానీ నేడు వరి పంటకు బోనస్ ఇస్తున్నామన్నారు. 18 నెలల్లో మహాలక్ష్మి పథకం కోసం 5500 కోట్లు- కేటాయించామని.. కోటి మంది మహిళలను కొటేశ్వరులు చేయాలన్నదే తమ లక్ష్యమని పునరుద్ఘాటించారు. మిస్ వరల్డ్ కాంపిటీషన్ కి వచ్చిన వారు మన ఆడబిడ్డలు చేసిన వస్తువులను చూశారన్నారు.. మహిళలే బస్సులు కొని ఆర్టీసీకి కిరాయి ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు-వివరించారు. ఇందిరమ్మని ఆదర్శంగా తీసుకుని సోనియమ్మ స్ఫూర్తితో ఆడబిడ్డలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేస్తామని భరోసా ఇచ్చారు.తెలంగాణ ఉద్యమంలో కీలకంగా ఉన్న యువతకు గత పదేళ్లుగా ఉద్యోగాలు లేవని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాను ముందున్న అన్న వ్యక్తి ఇంట్లో మాత్రం అందరికి ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు.. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి కోసం చర్యలు తీసుకుంటు-న్నామని.. మీ అందరూ అండగా ఉంటే ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే లక్ష్యమని చెప్పారు.అలాగే సీఎం రేవంత్‌రెడ్డి జగ్గారెడ్డి గురించి మాట్లాడారు. జగ్గారెడ్డి భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేస్తారు. వారికి ఇళ్ల పట్టాలు అందించే బాధ్యత జగ్గారెడ్డికి అప్పజెబుతున్నా. వారికి మంచి భోజనం పెట్టించి జగ్గారెడ్డి పట్టాలు ఇస్తారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం ప్రత్యేక సమీక్ష చేసి నిధులు మంజూరు చేస్తాం. ఎన్నికలు వచ్చినప్పుడే రాజకీయాలు...ఆ తర్వాత అభివృద్ధి మన అజెండా. సంజీవ రెడ్డి, సురేష్ షెట్కార్ నారాయణఖేడ్ కి రెండు కళ్ళలాంటి వారు. పటాన్ చెరు మినీ ఇండియా ప్రాంతం. ఇఐఊర, ఇఉర, కఒః, ఇక్రిశాట్ ఇవన్నీ కాంగ్రెస్ హయాంలో వచ్చినవే.. సింగూరు నుంచి మంజీరా జలాలు హైదరాబాద్ దాహార్తిని తీరుస్తున్నాయి. సింగూరు ప్రాజెక్టును టూరిజం హబ్ గా మారుస్తాంఅని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు.

# మళ్లీ జడలు విప్పుతున్న కరోనా

(మొదటి పేజీ తరువాయి)

గత రాత్రి కరోనా పరీక్షలు చేశారు. ఈ నేపథ్యంలో ఆమెకు కరోనా సోకినట్లు- రిమ్స్ వైద్యులు తేల్చారు. వృద్ధురాలికి వైద్యులు చికిత్స అందజేస్తున్నారు. ఇక కడప జిల్లాలో మరోసారి మొదటిగా ఒక కరోనా కేసు వెలుగులోకి రావడంతో జిల్లా ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక నిన్న విశాఖలో ఓ మహిళకు కరోనా పాజిటివ్‌గా తేలింది. దీంతో ఏపీలో ఇప్పటి వరకు రెండు కరోనా కేసులు నమోదు అయ్యాయి. విశాఖలో వివాహితకు కరోనా పాజిటివ్ అని తేలింది. మద్దెలపాలెంలోని పిఠాపురం కాలనీకి చెందిన 28 ఏళ్ల మహిళకు కోవిడ్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వివాహిత చలి జ్వరం, తీవ్రమైన దగ్గుతో ఓ ప్రైవేటు-ఆస్పత్రిలో చేరగా.. వైద్య పరీక్షల్లో కోవిడ్ 19గా నిర్ధారణ అయ్యింది. దీంతో ఆరోగ్య శాఖ అధికారులు కేజీహెచ్‌లో మరోసారి శాంపిల్‌ను పరీక్షించగా అది కూడా పాజిటివ్ గానే నిర్ధారణ అయ్యింది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉండగా వైద్యులు ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ చేయగా హోం ఐసోలేషన్‌లో ఉంచారు. ఆ వెంటనే ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మద్దెలపాలెంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. వివాహిత కుటుంబ సభ్యులందరికీ కరోనా పరీక్షలు నిర్వహించేందుకు నమూనాలు సేకరించి కేజీహెచ్‌కు పంపించారు. వారందరూ కూడా హోం ఐసోలేషన్‌లో ఉండాలని వైద్యులు సూచించారు. కాగా.. ఇప్పటికే ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కరోనాకు సంబంధించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్పష్టమైన ఆదేశాలిచ్చింది. గ్రూప్‌గా ఉన్న చోట తిరగవద్దు అంటూ పలు ఆదేశాలను ఈనెల 21నే వైద్య ఆరోగ్య శాఖ ఇచ్చింది.ప్రజలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో మాస్కులు కచ్చితంగా వాడాలని పేర్కొంది. అలాగే చలి జ్వరం , దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి-వాసన కోల్పోవడం, తలనొప్పి, కండరాల నొప్పులు, బాడీ పెయిన్స్, ముక్కు కారడం, ముక్కు దిబ్బడ, వికారం, వాంతులు, విరోచనాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. రైల్వేస్టేషన్లు , బస్టాండ్లు విమానాశ్రయాలు వంటి వాటిలో కోవిడ్ నిబంధనలు పాటించాలని ఏపీ ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది.

# కవిత లేఖపై స్పందించాల్సిన అసవరం లేదు

(మొదటి పేజీ తరువాయి)

అయ్యాక కూడా కెసిఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని మండిపడ్డారు. పార్టీ కేడర్‌ను కెసిఆర్ కలవట్లేదని స్వయంగా కవిత తనతో చెప్పిందని, బిఆర్ఎస్ పార్టీ డాడీ, డాటర్, సన్, సన్-ఇన్ లా.. పార్టీ అని విమర్శించారు.ఇకపోతే సైనికులను కించపరిచేలా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడటం సరికాదని, దేశం ప్రశాంతంగా ఉందంటే సైనికులే కారణమని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ..2018 ఎన్నికలప్పుడే బిఆర్ఎస్ పొత్తు అంటే వ్యతిరేకించామని, రాజకీయంగా మమ్మల్ని తిట్టండి, సైనికులను కాదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సర్జికల్ స్ట్రైక్ పై మాజీ సిఎం కెసిఆర్, కవిత ఆధారాలు అడిగారని అదే తరహాలో ఇప్పుడు రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాతున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వస్తే మేడిగడ్డపై సీబీఐ విచారణ చేయిస్తామని తమ మేనిఫెస్టోలో పెట్టామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు. బీటలు వారుతున్న పరిస్థితిలో కాంగ్రెస్ కు తెలివి వచ్చిందని.. సీబీఐ విచారణకు ఇవ్వాలని రాష్ట్ర అధ్యక్షుడుగా తాను డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కుటుంబ పార్టీలు ప్రజల కొంపలు ముంచుతాయన్నారు. ఆ ఉత్తరం ఓ డ్రామా.. డాడీ డాటర్‌ల మధ్య మాటలు లేవని ఇప్పుడే తెలిసింద న్నారు. ఆ పార్టీ గురుంచి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆ పార్టీ కి భవిష్యత్తు లేదని విమర్శించారు. తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయం అని ప్రజలు అనుకుం టున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు... రేవంత్ రెడ్డి సర్టిఫికెట్ కోసం తాను పని చేయడం లేదని.. తాను దుప్పటి కప్పుకుని పడుకుంటానని... రేవంత్ రెడ్డి ఏమీ కప్పుకుని పడు కుంటారు... నాకైతే తెలియదని వ్యాఖ్యానించారు. నక్సలైట్ ఎన్‌కౌంటర్లపై కిషన్ రెడ్డి మాట్లాడారు. టెర్రరిస్టు కార్యకలాపాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేసిన వ్యక్తిని నేను. నక్సలైట్లతో చాలాసార్లు చర్చలు జరిగాయి. చాలా మంది బయటకు వచ్చారు.. ఈ రాష్ట్ర ప్రభుత్వంలో మంత్రులు అయ్యారు. హింసకు తావులేదు. జనజీ వన స్రవంతి లోకి రావాలని మేము కోరుతున్నాం. తుపాకిల ద్వారా హింస ద్వారా ఏమీ సాధించలేరని వ్యాఖ్యానించారు. రైతు లు ఇబ్బందులు పడుతున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపా రు. ధాన్యం కొనుగోలు పై ప్రభుత్వం దృష్టి సారించి పూర్తిగా చేయాలని కోరుతున్న. 53 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరిం చేందుకు కేంద్రం రాష్ట్రంతో ఒప్పందం. ఇంకా అదనంగా తీసుకు నేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది.. ధాన్యం సేకరణ లో రాష్ట్ర ప్రభుత్వం పై నయా పైసా భారం పడదు. అదనపు సెంటర్ లు అయినా ఓపెన్ చేసి రైతుల దగ్గర ధాన్యం కొనుగోలు చేయాల న్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పట్లో జరుగుతాయనే నమ్మకం నాకు లేదు. ఎన్నికలు ఎప్పుడు జరిగిన బీజేపీ సిద్ధమేనని కేంద్ర మంత్రి తెలిపారు. ఢిల్లీకి రేవంత్ కప్పం కడుతున్నారని పునరుద్ఘాటించారు.

# హెరాల్డ్ కేసులో రేవంత్ పేరు ప్రస్తావన

(మొదటి పేజీ తరువాయి)



ఇప్పిస్తానని రేవంత్ రెడ్డి ప్రలోభ పెట్టాడని ఇడి నమోదు చేసిన చార్జిషీట్‌తో సిఎం అవినీతి సామ్రాజ్యం బట్టబయలైందని అన్నారు. అధికారం కోసం ముఖ్యమంత్రి కాకముందే కాంగ్రెస్ పార్టీ పెద్దలకు వందల కోట్లు కట్టబెట్టిన వ్యవహారం కుండబద్దలు కొట్టినట్టయిందని పేర్కొన్నారు. వందల కోట్లతో మొదలైన రేవంత్ అవినీతి బాగోతం గత ఏడాదిన్నరలో సిఎం పదవిని అడ్డం పెట్టుకుని ఏకంగా వేల కోట్లకు చేరిందని ఆరోపించారు. దివ్యమైన తెలంగాణని దివాళా తీసి వేల కోట్లు కొల్లగొట్టడం వల్లే ఇడి కేసులో రేవంత్ రెడ్డి అడ్డంగా ఇరుక్కుపోయారని దుయ్యబట్టారు. ఇప్పుడు రేవంత్ రెడ్డి,- పొంగులేటి తరహాలో చీకట్లో బిజెపి పెద్దల కాళ్లు పట్టుకుంటారా..? అని నిలదీశారు. ఇడి కేవలం చార్జిషీటులో పేరు పెట్టడం వరకే పరిమితం అవుతుందా.. లేక రేవంత్ రెడ్డిని విచారణను పిలిచి మొత్తం అవినీతి కుంభకోణాలను కక్కిస్తుందా..? అని ప్రశ్నించారు. రాష్ట్ర కాంగ్రెస్‌లో రోజురోజుకూ పేట్రేగిపోతున్న అంతర్గత కుమ్ములాటలతో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా కకావికల మైందని, పెరిగిపోతున్న తిరుగుబాట్లతో సిఎం కుర్చీ ఎప్పుడూ కూలిపోతుందో అనే భయం రేవంత్ రెడ్డిని అడుగడుగునా వెంటాడుతోందని అన్నారు. ఏం చేయాలో తెలియని దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటు-న్న కాంగ్రెస్, ముఖ్యమంత్రి.. అ-టె-న్షన్ డైవర్షన్ కోసం రోజురోజుకూ చేస్తున్న చిల్లర చేష్టలు, కొత్త కుట్రలకు తెరపడినట్టే అని పేర్కొన్నారు. సిఎం రేవంత్‌కు పిల్లనిచ్చిన మామ సూదిని పద్మారెడ్డియే స్వయంగా కాళేశ్వరంలో అవినీతి జరగలేదనడంతో ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ొవ్యూజులు ఒక్కసారిగా ఎగిరిపోయయని వ్యాఖ్యానించారు. కమిషన్లు లేనిదే ప్రభుత్వంలో ఒక్కటంటే ఒక్క ఫైలు కదలడం లేదని స్వయంగా కేబినెట్ మంత్రి కొండా సురేఖ కుండబద్దలు కొట్టడంతో కాంగ్రెస్ నిర్వాకా లన్నీ వరుసగా వెలుగుచూస్తున్నాయని చెప్పారు.30 శాతం పర్సెంటేజీలు ఇవ్వనిదే సొంత ప్రభుత్వం లో పనులు కావడం లేదని సాక్షాత్తూ కాంగ్రెస్ ఎంఎల్‌ఎ అనిరుధ్ రెడ్డి ఆ పార్టీ బట్టలిప్పడంతో కాంగ్రెస్ నిజస్వరూపం బయటపడిందని వ్యాఖ్యానించారు.నాలుగు కోట్ల ప్రజల ము ందు ముఖ్య మంత్రి అవినీతి బాగోతం బట్టబయలు కావడంతో కుడితిలో పడిన ఎలుకలా కాంగ్రెస్ పార్టీ కొట్టు-కుంటోందని విమర్శించారు. పచ్చని రాష్ట్రంలో చిచ్చుపెట్టడమే కాకుండా వేల కోట్ల ప్రజా ధనాన్ని లూటీ చేస్తూ, పేదల జీవితాలతో చెలగాటమాడుతున్న ముఖ్యమంత్రి పాపం పండిందని వ్యాఖ్యా నించారు. చివరికి ధర్మం గెలుస్తుంది..జై తెలంగాణ..జై కెసిఆర్ అంటూ కెటిఆర్ ట్వీట్ చేశారు.

# తెల్ల ఏనుగులా కాళేశ్వరం ప్రాజెక్ట్

**హైదరాబాద్,మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** కాళేశ్వరంలో అక్రమాలు తేల్చేందుకే దేశంలోనే పేరు మోసిన సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఘోష్ ఆధ్వర్యంలో కమిషన్ వేశామని తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు. తప్పు చేయకుంటే నోటీసులు ఇచ్చిన ప్పుడు హాజరు కాకుండా అనవసర వాదనలు ఎందుకని అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సీతక్కతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఏ తప్పు చేయకుంటే నోటీసు ఇవ్వగానే అంత ఉలుకు ఎందుకని ప్రశ్నించారు. నోటీసు ఇవ్వగానే కమిషన్‌ను తప్పుబడుతూ మాట్లాడటం విచారకరమన్న ఉత్తమ్.. ఇందిరగాంధీ లాంటి వాళ్లే కమిషన్ ముందు విచారణకు హాజరయ్యారని గుర్తు చేశారు. నోటీసులు ఇచ్చాక జ్యుడీషియల్ కమిషన్‌నే కించపరిచేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. చట్టపరమైన చర్యలు తీసుకునేం దుకే జ్యుడీషియల్ కమిషన్ వేశామన్నారు. బాంబులు వేశారని చెబుతున్నారు.కాళేశ్వరం తెల్ల ఏనుగుగా మారబోతోందని కేంద్ర సంస్థలు చెప్పాయి. భారాస ఎంపీల మద్దతుతోనే ఎన్డీఎస్‌ఏ చట్టం వచ్చింది. కాళేశ్వరం డీపీఆర్, రీడిజైన్, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ఎన్డీఎస్‌ఏ చెప్పింది. ప్రాజెక్టును పునఃవినియోగంలోకి తేవడంపై మేం చాలా అధ్యయనం చేస్తున్నాం. ప్రాజెక్టు పునాదుల్లోనే ఎన్నో లోపాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు. కూలిపోయిన ప్రాజెక్టును అద్భుతమని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. జ్యుడీషియల్ కమిషన్ ముందు హాజరై వాళ్ల వాదన ఏంటో వినిపించాలని ఉత్తమ్ కుమార్‌రెడ్డి అన్నారు.

# అవును నేనే లేఖ రాసా...

(మొదటి పేజీ తరువాయి)

నాయకత్వంలోనే పనిచేస్తాం. లేఖ రాయడంలో పర్సనల్ ఎజెండా ఏమీ లేదని కవిత చెప్పుకొచ్చారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ ముందుకు పోతుందని వెల్లడించారు. తనకు పార్టీ, కేసీఆర్‌తో ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులు సంబర పడొద్దని.. వాళ్లకు కోతికి కొబ్బరి చిప్పదొరికి నట్టయ్యి ందన్నారు. 'నేను నాకొడుకు గ్రాడ్యుయే షన్ సెర్మనీ పూర్తి చేసుకుని అమెరికా నుంచి వెళ్లి వచ్చే లోపల మరేదో లేఖ లీకైందని చెప్పి గత రెండు మూడు రోజులుగా హంగామా జరుగుతున్నట్లు- తెలుస్తోంది. ఈ సందర్భంగా నేను చెప్పదలుచుకున్నది ఒక్కటే. రెండు వారాల కిందట కేసీఆర్‌కి లేఖ రాయడం జరిగింది. గతంలో కూడా నా అభిప్రాయాలను కేసీఆర్‌కు లేఖ ద్వారా తెలియజేయడం జరిగింది. ఈ సారి కూడా లేఖ రాశాను. నేను మొన్ననే చెప్పాను. కుట్రలు కుతంత్రాలు జరుగుతున్నాయి అని. చెప్పిన కొద్ది రోజుల్లోనే నేను అంతర్గతంగా కేసీఆర్ కి రాసిన ఉత్తరం బహిర్గతం కావడంతో పార్టీలో ఏం జరుగుతుందో అన్నది మనమందరం ఆలోచించాల్సిన విషయం. నేను వేరే విషయాలు ఏం చెప్పలేదు. నేను కేవలం పార్టీలో అన్ని స్థాయిల్లో ఉన్న నాయకులందరూ అనుకుంటున్న విషయాలు దాదాపు సగం తెలంగాణ ప్రజలు అనుకుంటు-న్న విషయాలను మాత్రమే నేను పెద్ద ఎత్తున చెప్పడం జరిగింది. తనకు ఎలాంటి పర్సనల్ ఎజెండా లేదు. తనకు వ్యక్తిగతంగా ఎవరి మీద ద్వేషం లేదు. ఎవరి మీద ప్రేమ లేదు. కానీ నేను రాసిన లేఖ. అంతర్గతంగా రాసిన లేఖ బహిర్గతమైందంటే దీని వెనుక ఉన్నది ఎవరు అనేది ఆలోచించుకోవాల్సిన విషయమని కవిత వ్యాఖ్యానించారు.

# పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- పేద ప్రజల సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్న నాయకుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి







**హనుమకొండ, మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమానికి పాటు పడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. శుక్రవారంరఘునాథపల్లి మండల కేంద్రంలో ని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, మరియు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 42మంది కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు రూ. 42లక్షల 04వేల 872రూపాయల విలువగల చెక్కులను అలాగే 13మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ. 9లక్షల 36వేల 500రూపాయల విలువగల చెక్కులను లబ్ధిదారులకు లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూస్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో ఒక్క రఘునాథపల్లి మండలంలోనే ఏడాదిన్నర కాలంలో 400మంది లబ్ధిదారులకు సుమారు 4కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం పై 8లక్షల కోట్ల అప్పులు ఉన్నా వాటికీ మిత్తిలు కడుతున్న పేద ప్రజల సంక్షేమాన్ని ఆపకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆదాయనికి మించి ఖర్చులు ఉండడం వల్ల ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నేరవేరుస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి పెద్ద పీట వేస్తూ రైతులకు 21వేల కోట్ల రుణ మాఫీ, సన్నాలు పండించే రైతులకుక్వింటాకు రూ. 500 బోనస్, ఎకరానికి రూ. 12వేల రూపాయల రైతు భరోసా వంటి పథకాలను అమలు చేస్తున్నామని తెలిపారు. అలాగే మహిళా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యత కల్పిస్తుందని, అందులో భాగంగానే మహిళకు ఫ్రీ బస్ సౌకర్య, 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500రూపాయల గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలను మహిళలకు అందిటున్నట్లు వెల్లడించారు. రాష్టంలోని పేద వర్గాల ఆకలిని గుర్తించి వారికీ కడుపు నిండా అన్నం పెట్టాలనే ఆలోచనతో రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డు దారులకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. ఇప్పటికే రూ. 800కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నామని తెలిపారు. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపేందుకు ప్రతి నిత్యం కృషి చేస్తున్నాని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, ఆర్డీవో, తహసీల్దార్, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పది

- ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలి
- ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్ ఏర్పాటు చెయాలి
- వైద్యురాలిగా నాకు రక్తం విలువ తెలుసు
- రక్తదానం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత
- పరకాలలో నూతనంగా నిర్మించనున్న రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ స్టోరేజీ సెంటర్ శంకుస్థాపన, భూమి పూజ కార్యమానికి ముఖ్య అతిథిగా హాజరైన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య









**పరకాల, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** అన్ని దానాల్లో కెల్లా రక్తదానం గొప్పదని, రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయటమే అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం పరకాల మండల కేంద్రంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లడ్ స్టోరేజీ సెంటర్ శంకుస్థాపన, భూమి పూజ కార్యమానికి స్థానిక శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డితో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై భూమి పూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ డాక్టర్ కడియం కావ్య గారు మాట్లాడుతూ.... రక్తదానంతో ప్రాణాపాయంలో ఉన్న వారిని బతికించవచ్చున్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. ఒక వైద్యురాలిగా రక్తం విలువ తనకు తెలుసని అన్నారు. అత్యవసర సమయాల్లో బ్లడ్ అందుబాటులో లేక ఎంతో మంది ఇబ్బందులు పడుతూ ఉంటారని, ప్రమాదాలు జరిగినప్పుడు, ప్రెగ్నెంట్ లేడీస్, పోస్ట్ డెలివరీ సమయాల్లో సైతం బ్లడ్ అవసరం ఉంటుందని తెలియజేశారు. ప్రతి జిల్లాలో రెడ్ క్రాస్ అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం వరంగల్, హనుమకొండ జిల్లాలో రెడ్ క్రాస్ ఉందని, భూపాలపల్లి జనగామ జిల్లాల్లో రెడ్ క్రాస్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా తలసేమియా వ్యాధిగ్రస్తులకు బ్లడ్ చాలా అవసరమని బ్లడ్ కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లకుండా జిల్లాలోని రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ అందుబాటులో ఉంటే ప్రజలకు ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలియజేశారు. రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ నిర్వహణతో పాటు డ్రగ్ డిడిక్షన్ సెంటర్, ఆడపిల్లలకు రక్తహీనత పరీక్షలు, క్యాన్సర్ స్క్రీనింగ్ ఏర్పాటు చేస్తే ప్రజలకు మరింత మేలు జరుగుతుందని ఎంపీ వివరించారు. వరంగల్ కాకతీయ మెడికల్ కాలేజీ లో తలసేమియా ఐ సి ఎం ఆర్ పరిశోధన కేంద్ర ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు. హనుమకొండ జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రా ఏర్పాటుకు సంబంధించి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ సేవలను మరింత విస్తృతం చేయాలని ఎంపీ సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ సమస్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ విజయ్ చందర్ రెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, పరకాల హాస్పిటల్ సూపరిండెంట్ గౌతమ్ చౌహన్, ఆర్డిఓ, ఎమ్మార్వో, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్ రెడ్ క్రాస్ పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఈడీ ఛార్జ్‌షీట్‌లో సీఎం రేవంత్ రెడ్డి పేరు నమోదు ..??

- స్పందించిన మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈడీ ఛార్జ్‌షీట్‌తో రేవంత్ రెడ్డి బండారం బయటపడిందినాడు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడే విరాళాల కోసం ఒత్తిడి తీసుకొచ్చారని ఈడీ పేర్కొంది.పదవుల ఆశ చూపి విరళాలు వసూలు చేశారు.ఇప్పుడు ముఖ్యమంత్రి హెూదాలో కూడా అదే జరుగుతోంది.ఢిల్లీకి మూటలు పంపుతున్నారుకాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ఏటీఎంలా మారిందని మేము చెబుతూనే ఉన్నాం.ఈడీ ఛార్జ్‌షీట్‌తో మరోమారు స్పష్టమైంది.కమీషన్లు లేనిదే పనులు కావడం లేదని మంత్రి కొండా సురేఖ స్వయంగా చెప్పారు.30 శాతం కమీషన్లు అని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి బహిరంగంగా చెప్పారు.రేవంత్ రెడ్డి ఇప్పుడు ఏమంటారు?ఈడీ కేసు విషయంలో సమాధానం చెప్పాలిగతంలో అమృత్ స్కాం, సివిల్ సప్లైస్ స్కాం, ఇతరత్రాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం కనీసం పట్టించుకోలేదు.ఆర్ఆర్ ట్యాక్స్ అని స్వయంగా ప్రధానమంత్రి చెప్పినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు కేంద్రం వెంటనే చర్యలు తీసుకోవాలి ఆయన డిమాండ్ చేశారు.

# సరస్వతి నవరత్న మాలా హారతి



**కాళేశ్వరం,మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** వైభవోపేతంగా 9వ రోజు "సరస్వతి నవరత్న మాలా హారతి" కార్యక్రమంజిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొని ఆశీర్వాదం పొందారు. సరస్వతి పుష్కరాల్లో భాగంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న సరస్వతి నవరత్న మాలా హారతి 9వ రోజు శుక్రవారం కార్యక్రమం వైభవోపేతంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా భక్తులు పెద్దఎత్తున హాజరై శ్రీ సరస్వతీ దేవిని పూజించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హాజరై, హారతి తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆయన మాట్లాడుతూ, సాంస్కృతిక విలువలను, ధార్మిక పరంపరలను ఇలా ఉత్సవాల ద్వారా ముందుకు తీసుకెళ్లడం చాలా సంతోషమని తెలిపారు. సాయంత్రం వర్షం వచ్చినప్పటికి హారతి కార్యక్రమ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. సరస్వతి పుష్కరాలు జరుగనున్న 26వ తేదీ వరకు ప్రతి రోజు సాయంత్రం సరస్వతి నవరత్న మాలా హారతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.









## బొడ్రాయి ప్రతిష్టాపన మహెూత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

**హనుమకొండ, మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** రఘునాథపల్లి మండలం బాంజీపేట గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్టాపన మహెూత్సవానికి మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొడ్రాయి ప్రతిష్టాపన వేడుకలో భాగంగా గ్రామ దేవతలను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ దేవతల కృపా కటాక్షాలు గ్రామ ప్రజలపై ఉండాలని, గ్రామస్తులందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## ఆకేరు వాగు పరివాహక నివాస గృహాలను సందర్శించిన సీరోల్ మండల తహశిల్దార్ ఎ. పున్నం చందర్

**సిరోలు, మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** మండలం జిల్లా కలెక్టర్ ఆదేశాలకు మన్నెగూడెం రెవెన్యూ గ్రామ పరిధిలో మొద్దు గడ్డ తండా దుబ్బ తండా ఆకేరు వాగు పరివాహక నివాస గృహాలను సీరోల్ మండల తహశి ల్దార్ ఎ. పున్నం చందర్ సందర్శించడం జరిగింది.వారు మాట్లాడుతూ వాతావరణ శాఖ హెచ్చరిక కోరకు బంగాళాఖాతంలో, అరేబియా సముద్రంలో వాయుగుండం ఏర్ప డినందున వర్ష సూచన మేరకు తండా నివాసితులకు అప్రమత్తం చేయుటకు, తగు సూచనలు జారీ చేయడం జరిగింది.

## వ్యాస రచన పోటీలో పసరగొండ ఇషాన్వి అవార్డు ప్రధానం



**హనుమకొండ, మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** అమృత్ భారత్ పథకం లో భాగంగా ఇటీవల వరంగల్ రైల్వే స్టేషన్ పున ప్రారంభోత్సవం జరిగింది. ఇదే కార్యక్రమంలో వ్యాసరచన పోటీలో పసరగొండ ఇషాన్వి కి 2వ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా ఇషాన్వి కి మెమొంటో, ప్రశంస పత్రం(అవార్డు)ను ఎంపీ డీకే అరుణ, వరంగల్ మేయర్ గుండు సుధారాణి చేతుల మీదుగా అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బోర్నపల్లి గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

**హనుమకొండ, మే 23(పీసీడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ మునిసిపల్ పరిధిలోని బోర్నపల్లి గ్రామ గొర్రెల పెంపకం దారుల సహకార సంఘం నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా కేశ బోయిన ఓదెలు ప్రధాన కార్యదర్శిగా కేశ బోయిన అశోక్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా కేశవైన లింగయ్య ఎన్నికయ్యారు. అలాగే డైరెక్టర్లుగా నాని రమేష్ మేడుదుల రాజు కేశ బోయిన కేతమ్మ గుంపుల రాజమ్మ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు సాయంత్రం ప్రకటించారు. కాగా నూతనంగా ఎన్నికైన సంఘం నాయకులను సంఘ సభ్యులు శాలువాలతో,పూలమాలలతోఘనంగాసత్కరించిఅభినందనలు తెలిపారు.







## ముఖ్యమంత్రి జహీరాబాద్ పర్యటన

### - రైతుల అక్రమ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన బిఆర్ఎస్ శ్రేణులు

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన జరిగిన ప్రతిసారీ ముందస్తు అరెస్టులు, నిర్బంధాలు ఎందుకు? ఇదేనా ప్రజాపాలన అంటే? మొన్న నాగర్‌కర్నూల్ పర్యటనలో చెంచు సోదరులను అక్రమంగా అరెస్టు చేశారు. నేడు జహీరాబాద్‌లో రైతులను, రైతు నాయకులను అరెస్టు చేశారు. జహీరాబాద్ నిమ్స్ చుట్టూ ఉన్న గ్రామాలను అష్టదిగ్బంధనం చేసి, రైతు నాయకులను నిర్బంధించడం ఏ విధంగా ప్రజాపాలన అవుతుంది? ఇది ప్రజాపాలన కాదు, ప్రజలను పీడించే పాలన. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికీ తన ఆవేదనను వ్యక్తపరిచే స్వేచ్ఛ ఉంది. ఈ హక్కును హరించడం దుర్మార్గం. నిర్బంధాలు, కంచెలు, ఆంక్షలు, అరెస్టులు లేకుండా ముఖ్యమంత్రి పర్యటన జరిగే పరిస్థితి లేదు. అక్రమంగా అరెస్టు చేసిన రైతులను, రైతు నాయకులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, తెలంగాణ డీజీపీ ని డిమాండ్ చేస్తున్నాం.

## భక్తులకు సత్వరగా దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలి

### - దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎస్ వెంకట రావు



**కాళేశ్వరం, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** దేవాదాయ సిబ్బంది, ఆలయంలో పనిచేసే పోలీసులు, వాలంటీర్లు భక్తులకు సత్వరగా దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎస్ వెంకట రావు తెలిపారు. శుక్రవారం దేవస్థానం ఆవరణలో పుష్కరాల చివరి మూడు రోజులు భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో రద్దీ నియంత్రణ, సర్వ దర్శనం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. రాబోయే మూడు రోజుల్లో ప్రతి రోజు 3 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, రద్దీ రోజులలో మీ విధులు చాలా కీలకమని తెలిపారు. విధులు నిర్వహణకు ఈ అవగాహన కార్యక్రమం చాలా సహాయపడుతుందని ఆయన తెలిపారు. దేవాదాయ, పోలీస్, వాలంటీర్లు భక్తుల రద్దీ ఉన్నపుడు సమన్వయంగా వ్యవహరించి, సత్వరదర్శనం కల్పించాలని తెలిపారు. దర్శనం అవగానే భక్తులు త్వరగా బయటకు పంపేలా చూడాలని ఆగిపోవడం వల్ల రద్దీ పెరుగుతుందని తెలిపారు. భక్తులు దేవాలయంలో వేచి ఉండకుండా సత్వర దర్శనం చేపించి బయటకు వెళ్లడానికి సౌలభ్యత కల్పించాలని సూచించారు భక్తుల మధ్య ఎడం ఉండేలా చూడాలని కొద్దిగా ఎడం పాటించడం వల్ల త్వర త్వరగా వెళ్లడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. రద్దీ నియంత్రణ చేయకపోవడం వల్ల ఇబ్బందులు వస్తాయని సత్వర దర్శనం కలిగేలా చర్యలు తీసుకోవాలని డెమో నిర్వహించారు. భక్తులుక్యూ పాటించుట, దర్శనం తదుపరి భక్తులను బయటి కి పంపుట చాలా ముఖ్యమని తెలిపారుప్రతి రోజు 3 లక్షల మంది భక్తులు వస్తారని మన బాధ్యత ఎక్కువ మందికి దర్శనం కల్పించడమేనని అన్నారు. పుష్కరాల్లో విధులు నిర్వహించే అవకాశం మనకు కలిగిందని, భక్తులు తోపు లాట, తొక్కిసలాట లేకుండా సజావుగా దర్శనం అయ్యేలా క్యూ లైన్ మేనేజ్మెంట్ చేయాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రసన్న కుమార్, దేవాలయ ఈఓ మహేష్, దేవాలయ సిబ్బంది, పోలీస్, వాలంటీర్లు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందచేసిన జిల్లెల

**వనపర్తి :మే23(పీసీడబ్ల్యూ న్యూస్):** సిద్ది పేట్ జిల్లా ములుగు ప్రాంతానికి చెందిన ఖాన్ అనారోగ్యం కారణంగా ఆసుపత్రికి అయిన ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిదికి దరఖాస్తు చేసు కోగా 60,000/రూ.ల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అంద జేశారు. ముఖ్యమంత్రి సహాయ నిది ద్వారా కాంగ్రెస్ ఎంతో మంది పేద ప్రజలకు అండగా నిలుస్తుంది అని తెలియచేశారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ

**● ప్రత్యేక అధికారులు కొనుగోళ్ల కేంద్రాల తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి ● ధాన్యం కొనుగోళ్ల జిల్లా లక్ష్యం పూర్తి చేయుటకు అధికారులు కృషి చేయాలి ● రవాణా చేయు సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన సంబంధిత సెంటర్ నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక ● జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్**

**మహబూబాద్ జిల్లా సీరోల్ మే 23(పి.సి.డబ్ల్యూ న్యూస్):** ప్రత్యేక అధికారులు కొనుగోళ్ల కేంద్రాల తనిఖీలు నిర్వహించి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, ధాన్యం కొనుగోళ్ల జిల్లా లక్ష్యం పూర్తి చేయుటకు అధికారులు కృషి చేయాలన్నారు, జిల్లా కలెక్టర్ శుక్రవారం రోజున సిరోలు, కురవి, మహబూబాబాద్ మండలం కొత్తూరు, అయ్యగారి పల్లి, నేరెడ, కురవి, మాదాపురం, గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంబంధిత కేంద్రాలలో ఇప్పటివరకు వచ్చిన దాన్యం, ఇంకా రావాల్సిన దాన్యం, మిల్లులకు తరలించిన వివరాల నమోదు రిజిస్టర్ ను పరిశీలించారు. కొనుగోళ్లు చేసిన ధాన్యాన్ని వెంట వెంటనే మిల్లులకు తరలించాలని రవాణా చేయు సందర్భంలో ఎలాంటి ఇబ్బందులు ఏర్పడిన సంబంధిత సెంటర్ నిర్వాహకులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృశ్య వర్షాలు పడే అవకాశం ఉందని అందుకు తగిన ఏర్పాట్లను సెంటర్ నిర్వాహకులు రైతులకు కల్పించాలని, రైతును కూడా అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. గన్ని సంచులు, టార్పాలిన్స్, తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని, అన్లోడ్ చేసిన లారీలను అవసరం ఉన్న చోటకు వెంట వెంటనే పంపాలని తద్వారా ఎక్కడ రైతులు ఇబ్బంది పడకుండా ఉంటారని సూచించారు, హమాలీలను సిద్ధంగా ఉంచుకోవాలనీ, లారీ కాంట్రాక్టర్స్, రైస్ మిల్లర్లు, సెంటర్ నిర్వాహకులు సంబంధిత క్లస్టర్ సిబ్బంది, అందరూ సమన్వయంతో ఉండాలన్నారు. ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన ప్రదేశాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ సందర్శనలు చేసి ఎలాంటి జాప్యం లేకుండా వారం రోజుల లోపు జిల్లాలోని ధాన్యం కొనుగోల లక్ష్యం చేరుకోవాలని ఆయన తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యముకు సంబంధించి రైతు



వివరాలను ఆన్లైన్లో నమోదు చేసి వారికి డబ్బులు వెంటనే పడే విధంగా వ్యవసాయ శాఖ సంబంధిత సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, తహసిల్దార్లు, విజయ, రాజేశ్వరరావు, పున్నం చందర్, తదితరులు ఉన్నారు.

# నిరుపేదల కోణంలోనే సర్కారు పథకాలు...



**● లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేత ● తాడికల్, ఆముదాలపల్లి, కేశవపట్నం గ్రామాల్లో ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం ● భూమి పూజలు చేసిన ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి.**





**మానకొండూర్,మే23(పీసీడబ్ల్యూ న్యూస్):** నిరుపేదల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం పథకాలు అమలు చేస్తున్నదని మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ సత్యనారాయణ స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మక ఆరు గ్యారెంటీల అమలులో భాగంగా శుక్రవారం శంకరపట్నం మండలం తాడికల్, ఆముదాలపల్లి, కేశవపట్నం గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకుఆయన లబ్ధిదారులతో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీల విషయంలో ప్రతిపక్షాలు ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేశాయని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ పూర్తిస్థాయిలో అమలు చేస్తామని, అందులో భాగంగానే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తూ భూమి పూజలు నిర్వహిస్తున్నామని చెప్పారు. త్వరలో కొత్త రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని, ఆ వెనువెంటనే పెన్షన్లు ఇస్తామని ఆయన వివరించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా లేనప్పటికీ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాల అమలను కొనసాగించి తీరుతామని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ మిగతా పార్టీల మాదిరిగా శుష్క వాగ్దానాలు ఇవ్వదని, చేయగలిగిందే చెబుతుందన్నారు. ఇప్పటికే ప్రభుత్వం అమలు చేస్తున్న ఉచిత బస్సు ప్రయాణం, 500 కు గ్యాస్ సిలిండర్లు, 200 యూనిట్ల లోపు వారికి ఉచిత విద్యుత్తు, సన్న బియ్యం పథకాల ద్వారా ప్రజలు లబ్ధి పొందుతూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని ఆయన చెప్పారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాలపై కొందరు విమర్శలు చేస్తున్నారని, ఉచిత ప్రయాణాల అవసరం లేనివారే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రతినిత్యం బస్సు ప్రయాణాలు చేస్తున్న కూరగాయలు, పాల రైతులు, దినసరి కూలీలు, వివిధ షాపుల్లో పనిచేస్తున్న మహిళలను అడిగితే ఉచిత బస్సు ప్రయాణాల వల్ల ఒనగూరే మేలేంటో తెలుస్తుందన్నారు. ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదలైనలబ్ధిదారులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తుందని, వెంటనేనిర్మాణాలు ప్రారంభించి తొందరగా పూర్తి చేసుకోవాలనితెలిపారు. నిబంధనలకు అనుగుణంగా నాణ్యతతో నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారులందరూ సకాలం లో నిర్మాణపు పనులు చేపట్టిఇళ్ల ను నిర్మించుకునేందుకు తోడ్పాటు అందించాలని అధికారులకు సూచించారు. సొంతింటి సాకారం చేసే మహత్తర కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఇది మరువలేనిగొప్ప దినమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శంకర పట్నం మండల పరిషత్ అభివృద్ధి అధికారి గోల్కొండ కృష్ణ ప్రసాద్, మండల తహసిల్దార్ సురేఖ, ఎంపీఓ ప్రభాకర్, పిడి గంగాధర్ , గృహ నిర్మాణ సంస్థ డివిజనల్ ఇంజనీర్ వెంకట్ రమణ ఏఈ మూద్ అలీ పిసిసి సభ్యుడు, మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు కవ్వ పద్మ, మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చింతరెడ్డి పద్మ, పార్టీ నాయకులు ఉప్పుగళ్ళ మల్లారెడ్డి, గట్టు తిరుపతి, బండారు తిరుపతి, జనగామ అనిల్, అమ్ముల ఓదెలు, మొలంగూరు సదానందం, సుధగోని లక్ష్మీనారాయణ గౌడ్, ఒగ్గు దామోదర్, మర్రి యాదవ్, తిరుమల్ రెడ్డి, గోపు మల్లారెడ్డి, దేవ శ్రీనివాస్ రెడ్డి, పవన్ కుమార్, ముక్కిస రత్నాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ:-** శంకరపట్నం మండలానికి చెందిన 32 మంది లబ్ధిదారులకు 7,13,000 రూపాయల విలువగల చెక్కులను మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ పంపిణీ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయన చెక్కులను అందజేశారు. పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, పార్టీ నాయకులు కే పద్మ సిహెచ్ పద్మ, సదానందం, బంగారు తిరుపతి, గట్టు తిరుపతి పాల్గొన్నారు.

## హిందూ ఏక్త యాత్ర" ను విజయవంతం చేసిన హిందూ బంధువులందరికీ, బిజెపి శ్రేణులకు ధన్యవాదాలు...

**● బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దుబాల శ్రీనివాస్ ...**

**కరీంనగర్,మే23(పీసీడబ్ల్యూ న్యూస్):** హనుమాన్ జయంతి రోజున కేంద్ర మంత్రివర్యులు, కరీంనగర్ పార్లమెంటు సభ్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన " హిందూ ఏక్తాయాత్ర " ను విజయవంతం చేసిన హిందూ బంధువులందరికీ, బిజెపి నాయకులు, కార్యకర్తలు అందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు బిజెపి కరీంనగర్ అసెంబ్లీ కన్వీనర్ దూబాల శ్రీనివాస్ తెలిపారు. కరీంనగర్లో 12 సంవత్సరాల క్రితం కేంద్ర మంత్రివర్యులు బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన హిందూ ఏక్తా యాత్రకు రాష్ట్రవ్యాప్తంగా ఎంతో గుర్తింపు , ప్రాధాన్యత వచ్చిందని తెలిపారు. ప్రతి ఏటా హనుమాన్ జయంతి రోజున కరీంనగర్ పట్టణంలో అత్యంత వైభవంగా హిందూ ఏక్తాయాత్ర నేడు హిందువుల సంఘటితశక్తి కి దిక్సూచిగా మారిందని పేర్కొన్నారు. 22న హనుమాన్ జయంతి రోజున హిందూ ఏక్తాయాత్ర ఎంతో వైభవంగా జరిగిందని , వర్షాన్ని లెక్కచేయకుండా అశేష సంఖ్యలో తరలివచ్చిన హిందూ బంధువుల రాకతో ఏక్తా యాత్ర గ్రాండ్ సక్సెస్ అయిందన్నారు.,రాజకీయాలకతీతంగా ప్రజలు, హిందూ ధర్మం గురించి ఆలోచించే సమాజం, యువత స్వచ్ఛందంగా ఈ యాత్రలో పాల్గొన్నారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు. యాత్ర విజయవంతం కోసం కృషిచేసిన బిజెపి నాయకులు కార్యకర్తలు అందరికీ యాత్రకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.





## డ్రాయింగ్, పెయింటింగ్ పోటీలో పసరగొండ హరి చందనకు అవార్డు ప్రధానం

**హనుమకొండ, మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** అమృత్ భారత్ పథకం లో భాగంగా ఇటీవల వరంగల్ రైల్వే స్టేషన్ పున ప్రారంభోత్సవం జరిగింది. ఇదే కార్యక్రమంలో డ్రాయింగ్ , పెయింటింగ్ పోటీలో పసరగొండ హరి చందన మొదటి బహుమతి ని ఏజీఎం, శాసనమండలి డిప్యూటీ చైర్మన్ కొండ ప్రకాష్, ఎంపీ డాక్టర్ కడియం కావ్య చేతుల మీదుగా మెమొంటో, ప్రశంస పత్రం(అవార్డు) అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# నిట్ విద్యార్థి సోమిల్ మాల్దానికు
# రూ. 64.3 లక్షల ప్యాకేజీ

**● వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) తన ప్లేస్‌మెంట్ ను మెరుగు పరచడంతో పాటు సంస్థ ప్రదర్శించిన స్థిరత, విద్యార్థుల ప్రతిభ చాటింది**

**హనుమకొండ, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నా వరంగల్ ఎన్ఐటీ ప్లేస్‌మెంట్‌లో అద్భుత ఫలితాలు సాధించింది. 79.7 శాతం మంది విద్యార్థులకు ఉద్యోగాలు లభించగా, సోమిల్ మాల్దానికు రూ 64.3 లక్షల గరిష్ఠ ప్యాకేజీ దక్కిందని నిట్ పి ఆర్ ఓ డాక్టర్ రాహుల్ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సంవత్సరం 290కి పైగా సంస్థలు క్యాంపస్‌ను సందర్శించాయని, పరిశ్రమలో మంద గమనం కొనసాగుతున్న తరుణంలోనూ, వరంగల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) తన ప్లేస్‌మెంట్ ను మెరుగు పరచడంతో పాటు సంస్థ ప్రదర్శించిన స్థిరత, విద్యార్థుల పరిశ్రమ సిద్ధతను స్పష్టంగా చాటిందని వెల్లడించారు. ఈ సంవత్సరం మొత్తం 1,508 మంది విద్యార్థులు ప్లేస్‌మెంట్‌కు నమోదు చేసుకోగా, వీరిలో 791 మంది అండర్‌గ్రాడ్యుయేట్‌లు, 717 మంది పోస్ట్‌గ్రాడ్యుయేట్‌లు ఉన్నారని, వీరిలో 1,201 మంది ఉద్యోగాలు పొందారని పేర్కొన్నారు. గత సంవత్సరం 76 శాతంతో పోలిస్తే స్పష్టమైన పురోగతిని సూచిస్తుందని వివరించారు. ఈ సంవత్సరం గరిష్ఠంగా





రూ. 64.3 లక్షల ప్యాకేజీని సోమిల్ మాల్దాని ఒక ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ఇంజినీర్ గా ఉద్యోగాన్ని పొందారని తెలిపారు. ప్లేస్‌మెంట్ విజయాలపై వరంగల్ ఎన్ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ ఇది మా వ్యూహాత్మక దృష్టి, సహకార తత్వం, విద్యార్థులను పరిశ్రమ అవసరాలకు తగినవారిగా తీర్చిదిద్దాలన్న సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మన విద్యార్థులు తమ నైపుణ్యం, సర్దుబాటు సామర్థ్యం, వృత్తిపరమైన ప్రవర్తన ద్వారా తమ విలువను నిరూపించుకున్నారని తెలిపారు. శిక్షణ, పరిశ్రమ అనుసంధానాల విస్తరణ, ప్లేస్‌మెంట్ అవకాశాల వైవిధ్యాన్ని పెంచడం వంటి చర్యలు సఫలమయ్యాయని, అలాగే విద్యార్థుల సాంకేతిక, ప్రాయోగిక పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు వివిధ శాఖలతో కలసి



పారిశ్రామిక సందర్శనల్ని, విద్యా పర్యటనల్ని సమన్వయం చేసిందన్నారు. విద్యార్థులు నేరుగా పరిశ్రమల పనితీరును గమనించి, తరగతి గదిలోని విద్యను అన్వయించుకునే అవగాహన పెంచు కున్నారని, ప్లేస్‌మె ంట్ టీమ్‌ను అభినం దిస్తూ విద్యార్థులకు భవిష్యత్తులో శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ విజయానికి ప్రధాన కారణాల్లో ఒకటిగా నిలిచిన సెంటర్ ఫర్ కెరీర్ ప్లానింగ్ అండ్ డెవల డెవలప్మెంట్ వివిధ విభాగాల వారీగా పూర్వ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించి, సంవత్సరం పొడవునా, శిక్షణలు, వర్క్‌షాప్‌లు, కంపెనీ–స్పెసిఫిక్ ఇంటర్వ్యూల ప్రిపరేషన్, కమ్యూనికేషన్, ప్రాబ్లమ్ సాల్వింగ్ టెక్నిక్స్, మాక్ జీ డి లు, మాక్ ఇంటర్వ్యూలు, ఇంటర్నేషనల్ అవకాశాలపై అవగాహన సెషన్లు నిర్వహించబడ్డాయని, ఇది విద్యార్థుల నైపుణ్యాలను మెరుగుపరచడమే కాకుండా, వారి ఆత్మవిశ్వాసాన్ని, కార్పొరేట్ మానసికతను బలపరిచిందని సి సి పి డి హెడ్ ప్రొఫెసర్ పి. హరి కృష్ణ తెలిపారు.

# అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

**● రైతులు ఆందోళన చెందొద్దు.. ధైర్యంగా ఉండండి..**

**● మోరంచపల్లి, లక్ష్మారెడ్డిపల్లి, కర్కపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే జీఎస్సార్.. ● ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో సివిల్ సప్లై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే.. ● లారీల కొరత లేకుండా చూసి, ధాన్యాన్ని వెంటనే తరలించాలి..**

**● టార్పాలిన్లు అందించి ధాన్యం తడవకుండా చూడాలని సూచించిన ఎమ్మెల్యే..**

**గణపురం/భూపాలపల్లి, మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** భూపాలపల్లి నియోజకవర్గంలో అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులెవరూ ఆందోళన చెందొద్దని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు గారు సూచించారు. బుధవారం భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం లక్ష్మారెడ్డిపల్లి, కర్కపల్లి మరియు భూపాలపల్లి



మండలం మోరంచపల్లి గ్రామంలో అకాల వర్షాలతో తడిసిన వరి ధాన్యాన్ని స్థానిక కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. అక్కడ కొంతమంది రైతులు లారీలు సమయానికి రాక కల్లాలోనే వరి ధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సివిల్ సప్లై అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. ఎమ్మెల్యే క్యాంప్



కార్యాలయంలో జిల్లా సివిల్ సప్లై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే. కల్లాల్లో తడిసిన వరి ధాన్యాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అనంతరం భూపాలపల్లి మంజూరునగర్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో జిల్లా సివిల్ సప్లై అధికారులైన డీఎస్వో శ్రీనాథ్, డీమ్ సివిల్ సప్లై రాములు, డీసీవో వాల్యానాయక్ లతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షాల తో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఏర్పాటు చేయాలన్నారు. మిల్లర్లు సన్న వడ్లను దింపుకునేలా చూడాలని కోరారు. అదేవిధంగా, లారీల కొరత లేకుండా చూడాలని ఆదేశించారు.

# సామాజిక న్యాయం, సమాన అవకాశాలతో తెలంగాణను ప్రపంచంలోనే ఆదర్శవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుత

**● అప్పటివరకు విశ్రమించేది లేదని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి స్పష్టం ● హైదరాబాద్‌ను ఒక అద్భుతమైన నగరంగా అభివృద్ధి చేసి ప్రజలకు అంకితం చేసే వరకు నిద్రపోను ● అందుకు అండగా నిలబడాలని ప్రజలకు విజ్ఞప్తి**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో మంత్రులు దామోదర రాజనర్సింహ, కొండా సురేఖ, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ముఖ్యమంత్రి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ.... జహీరాబాద్ నిమ్జ్ కోసం భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కి ఆదేశాలిచ్చారు.గత పదేళ్ల కాలంలో జహీరాబాద్ నిమ్జ్ పూర్తిగా కుంటుపడిందని చెబుతూ, ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిమ్జ్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం పెంచి భూ సేకరణను వేగవంతం చేశామన్నారు. హ్యూందయ్ సంస్థ త్వరలోనే ఇక్కడ కార్యకలాపాలను ప్రారంభించనుందన్న శుభవార్తను ఈ సందర్భంగా ముఖ్యమంత్రి తెలిపారు.రైతులంతా కలిసి సహకార వ్యవస్థను ఏర్పాటు చేసుకుని నడిపిస్తామంటే చెక్కర కర్మాగారం ఏర్పాటుకు నిమ్జ్‌లో వంద ఎకరాలు కేటాయించి అందుకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామన్నారు.జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్ నియోజకవర్గాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు.ఎన్నికల సమయంలోనే రాజకీయాలు. ఆ తర్వాత అభివృద్ధి విషయంలో అందరినీ కలుపుకుని పనిచేస్తామని, అభివృద్ధి, రాష్ట్రానికి రావలసిన నిధుల విషయంలో ఎన్నిసార్లయినా ప్రధానమంత్రి మోదీని కలుస్తానని పునరుద్ఘాటించారు.మాజీ ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరా గాంధీ మెదక్ లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ చేసిన అనేకానేక అభివృద్ధి కార్యక్రమాలు, ఈ జిల్లాతో ఉన్న విడదీయలేని అనుబంధాన్ని వివరించారు. ఇందిరాగాంధీ స్ఫూర్తితో ప్రభుత్వం ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తోందని చెప్పారు.ప్రభుత్వం రైతు, మహిళా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని.. రుణ విముక్తులను చేయడానికి రైతులకు రుణమాఫీ, పెట్టుబడి సహాయం కింద రైతు భరోసాను 10 నుంచి 12 వేలకు పెంపు, మద్దతు ధరతో పాటు ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్ చెల్లింపు, భూమిలేని వ్యవసాయ నిరుపేదలకు 12 వేల చొప్పున సహాయం అందిస్తున్న విషయాలను ముఖ్యమంత్రి వివరించారు.మహిళల కోసం ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం, పేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రూ. 500 లకే వంట గ్యాస్ సిలిండర్ అందించడంతో పాటు రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో ఇప్పటివరకు తీసుకున్న చర్యలను వివరంగా తెలియజేశారు. వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోవడానికి నిర్దేశించుకున్న కార్యక్రమాలను విశదీకరించారు.జహీరాబాద్ పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో పాల్గొనడానికి ముందు ముఖ్యమంత్రి స్వయం సహాయక సంఘాలకు కేటాయించిన పెట్రోల్ పంపును ప్రారంభించారు. అక్కడే మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి వారి ఉత్పత్తులను పరిశీలించారు. సభా వేదికగా సంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్యకు బ్యాంకు లింకేజీ కింద రూ. 126.54 కోట్లు, మెప్మా కింద 17.51 కోట్లకు సంబంధించి చెక్కును అందజేశారు. జిల్లాలో రూ. 494.67 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో మంత్రులతో పాటు లోక్‌సభ సభ్యులు సురేష్ కుమార్ షెట్కార్, సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి తో పాటు ఉన్నతాధికారులు. ప్రజలు తదితరులు పాల్గొన్నారు.









# ఇందిరమ్మ తరహాలో రేవంత్ పాలన

**● కాంగ్రెస్ హయాంలో వేగంగా ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి ● మంత్రులు ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి జహీరాబాద్ పర్యటనకు హాజరు ● హెలిప్యాడ్ వద్ద పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికిన నీలం ● బస్వేశ్వర విగ్రహం,కేంద్రీయ విద్యాలయం,బహిరంగ సభలకు హాజరైన నీలం**

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** మెదక్ పార్లమెంట్ సభ్యురాలిగా పనిచేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధికి బాటలు వేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రగతిని మరింత ముందుకు తీసుకొని వెళుతుందని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనను పురస్కరించుకొని ఆ య కార్యక్రమాలలో మంత్రులు దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, ఎంపీ సురేష్ షెట్కార్, ఎమ్మెల్యేలు సంజీవరెడ్డి,లక్షికాంత్ రావు, మదన్ మోహన్ రావు,మాణిక్ రావు,టీజిఐఐసి చైర్మన్ నిర్మలా రెడ్డి,సెట్విన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి,టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, స్థానిక ఇంచార్జ్ మాజీ మంత్రి చంద్రశేఖర్ తో కలిసి ఆయన పాల్గొన్నారు. జహీరాబాద్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించిన బసవేశ్వర విగ్రహంతో పాటు కేంద్రీయ విద్యాలయ ప్రారంభోత్సవం, మహిళా స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రారంభం తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర నాయకులతో కలిసి పాల్గొన్న ఆయన, అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొ న్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిరమ్మ పాలన గుర్తు చేస్తూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం విశేషంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆనాడు ఇందిరమ్మ దయతో ఉమ్మడి మెదక్ జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందితే నేడు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ఈ ప్రాంతానికి మరిన్ని నిధులు ఇచ్చి అభివృద్ధికి సహకరిస్తుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధి పథంలో దూసుకుపోతుందని స్పష్టం చేశారు.

# కాశీ పండితులతో ముక్తీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో హారతి

**కాళేశ్వరం, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో శుక్రవారం ఉదయం కాశీ నుండి విచ్చేసిన పండి తుల ఆధ్వర్యంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవాలయం లో భక్తిశ్రద్ధలతో హారతి కార్యక్రమం నిర్వహించ బడింది. సరస్వతి నవరత్న మాలా హారతి ఉత్సవాల నేపథ్యంలో ఈ ప్రత్యేక హారతి కార్యక్రమం శోభాయమానంగా జరిగింది.ప్రారంభంగా వేదఘో షల మధ్య స్వామి వారికి పూర్ణాహుతులతో హారతి సమర్పి ంచారు. ఆలయ ప్రాంగణం పుణ్యవాతావరణంతో మార్మోగింది. కాశీ పండితులు ఆలయ ఆచార సంప్రదాయాల మేరకు హారతి నిర్వహించి, భక్తులకు దివ్యానుభూతిని కలిగించారు.ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమం అనంతరం పూజారులకు ఘన స్వాగతం పలికారు.ఈ హారతి కార్యక్రమం సరస్వతి నవరత్న మాలా ఉత్సవాల్లో ఒక ముఖ్యమైన ఘట్టంగా నిలిచింది.



# హిందూ ఏక్తా యాత్ర గ్రాండ్ సక్సెస్...

- కరీంనగర్లో హిందువుల బలం స్పష్టంగా కనిపించింది.
- ఏక్తాయాత్రను విజయవంతం చేసిన హిందూ బంధువులందరికీ ధన్యవాదాలు .
- మీడియా సమావేశంలో మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు...



**కరీంనగర్,23మే(పీసీడబ్ల్యూ న్యూస్):** కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆద్వర్యంలో హనుమాన్ జయంతి రోజున కరీంనగర్లో జరిగిన హిందూ ఏక్తా యాత్ర గ్రాండ్ సక్సెస్ అయిందని, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అశేష సంఖ్యలో హిందూ బంధువులు అందరూ తరలివచ్చారని, కరీంనగర్ లో హిందువుల బలమేంటనేది స్పష్టంగా కనిపించిందని మాజీ మేయర్ సునీల్ రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్లోని ఎస్.బి.ఎస్, ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ హిందూ ఏక్తా యాత్ర కు వర్షాన్ని లెక్క చేయకుండా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారన్నారు.భారతదేశ సైనికులు ఎలాగైతే దేశాన్ని కాపాడుతారో... అదే విధంగా పెద్ద ఎత్తున హిందువులు వచ్చి ఏక్తా యాత్ర ను విజయవంతం చేశారని తెలిపారు. హిందూ ఏక్తా యాత్ర భవిష్యత్తులో హిందువుల బలాన్ని మరింత ముందుకు తీస్కెల్లేలా కొండంత అండను చేకూర్చిందన్నారు.స్వచ్ఛందంగా ఏక్తా ర్యాలీకి తరలి వచ్చిన యువతి యువకులు, మహిళలు, పెద్దలకు, హిందూ బందువులందరికీ హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా చెప్పారు. కరీంనగర్ అంటేనే కాషాయం అనే విధంగా నగర వీధులన్నీ కాషాయ జెండాలతో రెపరెపలాడుతూ అందరికి ఆనందం కలిగించాయన్నారు. చిన్నారులు సైతం ఏక్తా యాత్ర ర్యాలీలో ఎంతో ఉత్సహంగా పాల్గొని నడిరేయి జాము వరకు సంతోషంగా ర్యాలీలో పాల్గొన్నారనీ తెలిపారు. గత కొద్ది రోజులుగా మంత్రి బండి సంజయ్ ఆదేశాల మేరకు హిందూ ఏక్తా యాత్ర ను విజయవంతం చేయడానికి ప్రయత్నం చేసిన ప్రతి ఒక్క సోదరుడికి హృదయ పూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.నిన్నటి ర్యాలీని చూసిన తర్వత కొంత మంది నిద్రలేని రాత్రిని గడిపారనీ, కరీంనగర్ లో కాషాయ దళాన్ని చూసిన తర్వాత కొంత మంది జీర్ణించుకోలేక, అసూయతో కుమిలిపోతున్నారని పేర్కొన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పీచ్ హిందు సమాజంలో కొత్త ఉత్సాహాన్ని నింపిందన్నారు.హిందువులు కలిసి ఐక్యంగా ఉండి దేశం కోసం, ధర్మం కోసం ఏం చేయాలనే విషయాలను బండి సంజయ్ చాలా గొప్పగా వివరించారని, ముఖ్యంగాసనాత ధర్మం, దేశ గొప్పదనం, హిందుత్వ గొప్పదనం లాంటి ఎన్నో విషయాలను కరీంనగర్ ప్రజలకు తెలియజేశారన్నారు. భారత్ పాక్ యుద్దాన్ని ఖర్కె, రాహుల్, రేవంత్ లాంటి కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్న మనస్తత్వం తో ఆలోచించడం చాలా దుర్మార్గమన్నారు. ఇప్పటి కైన కాంగ్రెస్ పార్టీ నాయకులు మన దేశాన్ని చిన్నగా చూస్తూ ప్రత్యర్థ దేశాలను గొప్పగా చూసే మనస్తత్వం ను మార్చుకోవాలన్నారు. శత్రు దేశం స్థవరాలను కుప్ప కూల్చి యుద్ధంలో విజయకేతనం ఎగరవేసిన చరిత్ర మన భారత సైన్యం దనీ, ఇంత గొప్ప సైని శక్తిని కాంగ్రెస్ పార్టీ నాయకులు తక్కువ అంచనా వేయడం అనేది చాలా దుర్మార్గ చర్య అని మండిపడ్డారు.ఇలాంటి దిగజారుడు తనాన్ని కాంగ్రెస్ పార్టీ మానుకోవాలన్నారు. కల్వకుంట్ల కవిత వాళ్ల తండ్రికి లెటర్ రాస్తే కరీంనగర్ లో ఒక మంత్రి బీజేపి బీఆర్ఎస్ పై వ్యాక్యలు చేస్తున్న మంత్రికి ఏమైనా అవగాహన ఉందా అని ప్రశ్నించారు.బీఆర్ఎస్ పార్టీ లో అంతర్గతంగా జరుగుతున్న విషయానికి బీజేపీ కి ఏమైనా సంబంధం ఉందా. బీఆర్ఎస్ నాయకులు ఆ లేక పట్ల స్పష్టంగా తెలియజేయాల్సిన బాధ్యత వారికే ఉందన్నారు. గతంలో పొత్తులు పెట్టుకున్న చరిత్ర బీఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ లదే న్నారు. భవిష్యత్తులో మల్లీ బీఆర్ఎస్ కాంగ్రెస్ పొత్తు పెట్టుకొని... పోటి చేసే పరిస్థితి ఉంది తప్పా బీజేపీతో ఎట్టి పరిస్థితుల్లో లేదన్నారు. మంత్రి తెలిసి తెలియక మాట్లాడుతున్నారా.... గత విషయాలను మరిచి మాట్లాడుతున్నారా ఆయనే సమాదానం చెప్పాలన్నారు.లోపాయికార ఒప్పదం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ కి బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల్లో మద్దతు పలికిన చరిత్ర వాళ్లకే ఉందన్నారు.రాబోయే రోజుల్లో బీజేపి పార్టీ ఆధిపత్యాన్ని ఎవ్వరూ కూడ అడ్డుకునే పరిస్థితి లేదని, బీఆర్ఎస్ పార్టీ కి పత్యామ్నాయంగా ప్రజలు బీజేపి పార్టీ వైపు చూస్తున్నారనే కవిత చెప్పిన మాట సజీవ సాక్ష్యమ న్నారు.మీడియా సమావేశంలో భారతీయ జనతా పార్టీ మాజీ కార్పోరేట్లు, నాయకులు, కార్యకర్తలు తదితరులుపాల్గొన్నారు.



## నాగుర్లపల్లి కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

**రేగొండ,మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆదేశాల మేరకు రేగొండ మండలం నాగుర్లపల్లిలో గ్రామ కాంగ్రెస్ కమిటీని ఎన్నుకున్నారు. కనపర్తి ఎంపీటీసీ పరిధి ఇంచార్జ్ బోయిన వినోద్ కుమార్ ఈ వివరాలను వెల్లడించారు. నూతనంగా ఎన్నికైన కమిటీలో హంసా రెడ్డి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా, దార్ల ఓం శంకర్,మోతె రాజశేఖర్ ఉపాధ్యక్షుడిగా మరియు ముత్యాల అజయ్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడానికి నూతన కమిటీ కృషి చేయాలని కోరారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత కమిటీపై ఉందని గుర్తుచేశారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు నాయకత్వంలో భూపాలపల్లి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన నూతన అధ్యక్షుడు హంసా రెడ్డి, అందరి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానని హామీ ఇచ్చారు.

# పుష్కరాల సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ 11 క్యాంపులు ఏర్పాటు





**కాలేశ్వరం, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో సరస్వతి పుష్కరలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక సేవలు కాలేశ్వర ముక్తేశ్వరాలయం కేంద్రంగా సాగుతున్న సరస్వతి పుష్కరాల కోసం వైద్య ఆరోగ్యశాఖ విస్తృత సేవలు అందిస్తున్నట్లు డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ తెలిపారు. 15- 5 -25 నుండి 26 -5- 2025 వరకు జరుగుతున్న సరస్వతి పుష్కరాల సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ 11 క్యాంపులు ఏర్పాటు చేసి ప్రతిరోజు సుమారు 1000 నుండి 1500 మందికి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కాలేశ్వరం, ఓల్డ్ ఈవో ఆఫీస్, గుడి ప్రాంగణంలో రెండు, టెన్ సిటీ, పార్కింగ్ ఏరియా, హరిత హెూటల్, జాయ్ రైడ్, గోదావరి మెయిన్ గేట్, విఐపి గాట్ నందు క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగినది ఈ క్యాంపు లలో వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బంది విడుదలవారీగా 24/7 విధులు నిర్వహిస్తున్నారు అన్ని విధములైనటువంటి మందులు అందుబాటులో ఉన్నవి దీనితోపాటు 108 వెహికల్స్ 5,బైక్ అంబులెన్స్ 5 అత్యవసర చికిత్స కొరకు అందుబాటులో ఉండి సేవలందిస్తున్నారు రిఫరల్ హాస్పిటల్ గా మహాదేవపూర్ సి హెచ్ సి నందు ఏర్పాటు చేశారు, ఈ హాస్పిటల్ నందు నిపుణులైనటువంటి వైద్యులు గైనకాలజిస్ట్, జనరల్ ఫిజీషియన్, పీడియాట్రిక్, జనరల్ సర్జన్,అనస్థీషియా,మొదలగువారు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారుఎమర్జెన్సీ కేసులను 108 ద్వారా మహాదేవపూర్ సిహెచ్సి సి తరలించడం జరుగు చున్నది. డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ మధుసూదన్ మరియు ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, ప్రమోద్ కుమార్, సందీప్, సుస్మిత 24/7 అందుబాటులో ఉండి పర్యవేక్షిస్తు, విధులు నిర్వహిస్తున్నారు. నేటి వరకు 61130మందికి చికిత్స అందించడం, 324 నందిని అడ్మిట్ చేయడం, 19 మందిని వివిధ కారణాల వలన రెఫర్ చేయడం జరిగింది,మరణాలు ఏమీ లేవుముక్తేశ్వర స్వామి వారి సన్నిధిలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలలో వచ్చు భక్తులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరుకోవాలని డిఎం అండ్ డాక్టర్ మధుసూదన్ కోరారు ములుగు డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ గోపాల్ రావు, వరంగల్ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ అప్పయ్య విధి నిర్వహణలో వారి యొక్కసేవలను అందిస్తున్నారు.

### రవాణాశాఖ కార్యాలయాన్ని పరిశీలించిన

## డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్

**భూపాలపల్లి, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ పురుషోత్తం శుక్రవారం భూపాలపల్లిలోని రవాణాశాఖ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. సరస్వతి పుష్కరాల నేపథ్యంలో రానున్న మూడు రోజుల్లో భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్నందున, వాహన రవాణాలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్టీఓ సంధానితో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా ప్రభుత్వంలో 12 ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల మూసివేత

- ఎస్సీలు ప్రజలు కాదా రేవంత్ రెడ్డి.....?
- సరిపడా విద్యార్థుల్లేరనే సాకుతో సర్కారు నిర్ణయం.
- ఆ విద్యార్థులు వేరే కళాశాలల్లోకి బదలాయింపు.
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు
- ఆందోళనలో విద్యార్థులు, తల్లి తండ్రులు.

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ఆధ్వర్యంలోని 12 జూనియర్ కాలేజీలు మూతపడుతున్నాయి. సరిపోయినంత మంది విద్యార్థులు చేరడం లేదనే సాకుతో వాటిని ఎత్తేయాలని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి నిర్ణయించింది. అక్కడ చదువుతున్న విద్యార్థులను దగ్గరలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ జూనియర్ కాలేజీల్లోకి మార్చాలని నిర్ణయం తీసుకుంది. వచ్చే విద్యాసంవత్సరం (2025-26) నుంచి ఈ నిర్ణయం అమల్లోకి వస్తుందని ప్రకటించింది. దీంతో అక్కడ చదువుతున్న విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే పదో తరగతి ఫలితాలు విడుదలయ్యాయి. ఆ 12 ఎస్సీ గురుకులాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం పొందాలనే ఆశతో ఉన్న విద్యార్థులకు నిరాశే ఎదురు కానుంది. ఈ నిర్ణయం వల్ల దళిత విద్యార్థులు తీవ్రంగా నష్టపోనున్నారు. ఒక్కో జూనియర్ కాలేజీలో రెండు కోర్సుల చొప్పున ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 120 సీట్లు, ద్వితీయ సంవత్సరంలో 120 సీట్లు కలిపి 240 సీట్లుంటాయి. ఈ లెక్కన 12 ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల్లో 2,880 సీట్లు రద్దవుతాయి. అంటే పేద విద్యార్థులు ముఖ్యంగా దళిత విద్యార్థులు గురుకుల విద్యను కోల్పోతారు. టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి అలుగు వర్షిణి తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని విద్యార్థి, తల్లి తండ్రుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.**మసకబారుతున్న గురుకులాల ప్రతిష్ట** రాష్ట్రంలో ప్రయివేటు, కార్పొరేట్ జూనియర్ కాలేజీలకు దీటుగా గురుకుల విద్యాసంస్థలు నడుస్తున్నాయి. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రభంజనం సృష్టిస్తున్నాయి. గురుకులాల్లో చదివే విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచి సత్తా చాటుతున్నారు. పది, ఇంటర్ ఫలితాలతోపాటు జేఈఈ, నీట్, ఎప్‌సెట్ వంటి ప్రవేశ పరీక్షల్లోనూ మంచి ర్యాంకులను సాధిస్తున్నారు. పదేండ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ గురుకులాలను అభివృద్ధి చేసేందుకే ప్రాధాన్యత ఇచ్చింది. కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్యను అందించడంలో భాగంగా 293 ఉన్న గురుకులాలను 1023కి పెంచింది. ఇందులో ఎస్సీ గురుకులాలు 268 ఉన్నాయి. ఇందులో 1.50 లక్షల మంది చదువుతున్నారు. 238 ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీలున్నాయి. వాటిలో 31,564 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఎస్సీ గురుకులాల్లో ఎంపీపీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ (సీవోఈ)లకు ఎంతో ప్రాధాన్యత ఉన్నది. ప్రత్యేక ప్రవేశపరీక్ష ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. వాటిలో జేఈఈ, నీట్, ఎమ్ సెట్ లాంటి పోటీ పోటీ పరీక్షల కోసం విద్యార్థులపై ప్రత్యేక దృష్టి ఉంటుంది. సాధారణ ఎస్సీ గురుకుల జూనియర్ కాలేజీల్లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో పదో తరగతి గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ) ఆధారంగా విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తారు. ఇంత ప్రతిష్ట ఉన్న ఎస్సీ గురుకుల విద్యాసంస్థల్లోని మొత్తం సీట్లలో ఇప్పుడు విద్యార్థులు చేరడం లేదు. గురుకులాల్లోనూ సీట్లు మిగిలే దుస్థితికి చేరుకున్నాయి అని డొంక తిరుగుడు కారణం చేత తీసివేస్తున్నాము అని చెపుతున్నా కార్యదర్శి అలుగు వర్షిణి.దీంతో వాటి ప్రతిష్ట మసకబారుతున్నది.**సమీకృత గురుకులాల పేరుతో ఆర్భాటం** ఇంకోవైపు గురుకులాల సంఖ్యను 293 నుంచి 1023కు గత ప్రభుత్వం పెంచినా వాటిలో 662 గురుకులాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మౌలిక వసతుల సమస్య, ఇతర కారణాలతో విద్యార్థులు చేరేందుకు ఆసక్తి చూపడం లేదు. సొంత భవనాలను నిర్మించి వసతులను మెరుగుపర్చాల్సిన ప్రభుత్వం ఆ కాలేజీలను మూసివేయాలని నిర్ణయం తీసుకోవడం గమనార్హం. మరోవైపు అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున సమీకృత గురుకులాలను నిర్మిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించింది. 105 సమీకృత గురుకులాలను మంజూరు చేసింది. వాటిలో 58 సమీకృత గురుకులాల నిర్మాణం కోసం రూ.662 కోట్లు విడుదల చేసింది. రెండేండ్లలో వాటిని పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఒకవైపు సమీకృత గురుకులాల పేరుతో ఆర్భాటం చేస్తూనే ఇంకోవైపు గతంలో ఉన్న 12 ఎస్సీ గురుకులాలను మూసివేయాలన్న ప్రభుత్వ నిర్ణయం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్పొరేట్ కాలేజీల్లో రూ.లక్షల ఫీజులతో విద్యావ్యాపారం చేస్తున్నాయి. గురుకులాల వల్లే కార్పొరేట్ కాలేజీల వల్ల తల్లిదండ్రులకు కొంత ఉపశమనం ఉన్నది. ఇప్పుడు 12 గురుకుల జూనియర్ కాలేజీలను మూసివేయడం కార్పొరేట్ విద్యాసంస్థల వ్యాపారం పెంచడానికే ఉపయోగ పడుతుందని విద్యావేత్తలు విమర్శిస్తున్నారు. **జిల్లాలోని కె వి పి ఎస్ సంఘం స్పందన** సాంఘిక సంక్షేమ గురుకులాల్లో కళాశాల ఎత్తివేత నిర్ణయం ఉపసం హరించుకొవాలి.. రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 12 ఎస్సీ గురుకుల కళాశాలలు ఎత్తివేత.. రాష్ట్ర వ్యాప్తంగా వేల మంది పేద విద్యార్థులకు తీవ్ర నష్టం..ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో దళిత పేద విద్యార్థులకు తీవ్రని నష్టం.సంగారెడ్డి జిల్లాలో రాయికోడ్ గురుకుల కళాశాల ఎత్తివేత, కొండాపూర్ లో బైపిసి, హత్నూర లో ఫార్మా టెక్నాలజీ,బైపిసి, జహీరాబాద్ లో ఎమ్మెల్టి , సింగూర్ లొ వోకేషన్ కోర్సుల ఎత్తివేత. ఈ కళాశాలల ఎత్తివేత నిర్ణయాన్ని ఉపసంహరించుకోక పోతే రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తా మని కెవిపిఎస్ సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ ఒక ప్రకటనలో హెచ్చరించారు. **తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ స్పందన.** రాష్ట్రంలో ఉన్న ప్రతి గురుకులాన్ని కాపాడుకుంటాం. ప్రభుత్వ అధికారులకు ఖచ్చితంగా బుద్ధి చెప్తా మని తెలంగాణ గురుకులాల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధికా ర ప్రతినిధి అంబాల కిరణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.



# టెర్రరిస్ట్ యూనివర్సిటీలను ధ్వంసం చేసిన ఇండియన్ ఆర్మీకి హ్యాట్సాఫ్ సెల్యూట్...

**• జమ్మికుంట తిరంగా యాత్రలో బిజెపి జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి...**




**జమ్మికుంట,మే23(పీసీడబ్ల్యూ న్యూస్):** ఆపరేషన్ సిందూర్ విజయవంతం అయిన సందర్భంగా వీర జవాన్లకు వందనాలు తెలుపుతూ, భారతదేశ శక్తిని ప్రపంచానికి చాటిచెప్పిన అన్ని రక్షణ వ్యవస్థలను అభినందిస్తూ దేశ వ్యాప్తంగా తిరంగా యాత్రలు నిర్వహించాలని భారతీయ జనతా పార్టీ జాతీయ నాయకత్వం పిలుపునిచ్చిన నేపథ్యంలో జమ్మికుంట బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున సాయంత్రం పట్టణంలో భారీ తిరంగా ర్యాలీ చేపట్టింది. ఇట్టి కార్యక్రమానికి బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై తిరంగా ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్లోని పహల్గం లో ఉగ్రవాదులు విచక్షణ రహితంగా జరిపిన కాల్పుల్లో అమాయకులు ప్రాణాలు కోల్పోయారని, ఉగ్ర మూకుల దాడిని యావత్ దేశం ముక్తకంఠంతో ఖండించిందని తెలిపారు. ఉగ్రవాదుల చర్యలతో భారతీయుల రక్తం మరిగిపోయిందన్నారు. టెర్రరిస్టులకు పాకిస్తాన్ దేశం అడ్డగా మారిందని , అనేక ఉగ్ర సంస్థలు ఇక్కడి పాకిస్తాన్ కేంద్రంగానే (టెర్రరిస్ట్ యూనివర్సిటీ) తమ సంస్థ కార్యకారపాలను కొనసాగిస్తున్నాయన్నారు. అందుకే ఉగ్రముకల సంస్థల (యూనివర్సిటీ) లను, ఉగ్రవాదుల ఏరివైతే లక్ష్యంగా మోడీ ప్రభుత్వం ఆపరేషన్ సింధూర్ చేపట్టిందని, అందులో భాగంగా దేశ త్రివిధ దళాలకు, సైన్యానికి పూర్తి స్వేచ్ఛనిచ్చిందన్నారు. ఆపరేషన్ సింధూర్ తో ఇండియన్ ఆర్మీ తమ సత్తా చాటి, దేశశక్తిని ప్రపంచానికి చాటి చెప్పిందన్నారు. టెర్రరిస్ట్ స్థావరాలను పూర్తిస్థాయిలో భారత సైన్యం మట్టు పెట్టిందని, వందమంది ఉగ్రవాదులను, ఉగ్ర ముఖ్య నేతలను ఇండియన్ ఆర్మీ హత మార్చిందని పేర్కొన్నారు. దీంతో దాయాది దేశం, ఉగ్రముకలు తోక ముడిచాయని, మూడు రోజుల్లోనే కాళ్ల బేరానికి వచ్చాయన్నారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారతదేశం విశ్వగురు స్థాయికి ఎదిగిందని, ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే ధైర్యం భారతదేశానికి ఉందనే విషయం ప్రపంచానికి మొత్తం అర్థమైందన్నారు.ఆపరేషన్ సిందూర్ పేరిట భారత సైన్యం చేపట్టిన చర్యలకు దేశ ప్రజలు పూర్తిస్థాయి మద్దతు తెలిపారని,26 నిమిషాల్లో పాకిస్థాన్ లోని ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసిన ఘనత భారత సైన్యానికి దక్కుతుందన్నారు. పాకిస్థాన్ తుప్పు పట్టిన చైనా ఆయుధాలు, పనికిరాని టర్కీ డ్రోన్లతో అల్లకల్లోలం సృష్టించాలనుకుందనీ, అయితే భారత సైన్యం స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన రక్షణ వ్యవస్థలతో అద్భుతమైన విజయం సాధించిందని తెలిపారు. చివరికి పాకిస్థాన్ అమెరికా ద్వారా శరణు వేడేలా భారత ప్రధానమంత్రి తో బ్రతిమిలాడుకునే స్థాయికి దిగజారిందన్నారు.భారత సైనికులు స్వదేశీ పరిజ్ఞానంతో తయారు చేసుకున్న క్షిపణి వ్యవస్థ, ఆయుధాలతో పాకిస్థాన్ కు నిద్రలేని కాలరాత్రులు గడిపేలా చేశారని,రానున్న కాలంలో పాకిస్థాన్ ఎటువంటి కవ్వింపు చర్యలకు, దురాగతాలకు పాల్పడినా తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని భారత ప్రధాని ధీటుగా బదులిచ్చారన్నారు. ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పోరాడి అమరులైన వీర జవాన్లకు, వీరోచిత పోరాటం చేస్తున్న భారత సైనికులకు వందనాలు తెలియజేస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా మండల, అసెంబ్లీ కేంద్రాల్లో తిరంగా యాత్ర కార్యక్రమాలు పార్టీ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. ప్రజలందరూ తిరంగా యాత్రలో పాల్గొని, భారత సైనికులకు వందనాలు తెలియజేయాలని, మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేయాలని, ఉగ్రవాద నిర్మూలనకు సంకల్పబద్ధంగా శపథం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

## ఎస్కె అంజాద్ పాషా కల్చరల్ అసోసియేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో 25న గాన మాధురి



**ఖమ్మం, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి) :** ఎస్ కె అంజాద్ పాషా కల్చరల్ అసోసియేషన్ ఖమ్మం వారి ఆధ్వర్యంలో ఈ నెల 25న భక్త రామదాసు కళా క్షేత్రంలో తెలుగు , హిందీ మధుర గీతాల సినీ సంగీత గాన మాధురి ని నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు ఎస్ కె అంజాద్ పాషా తెలిపారు . ఈ కార్యక్రమానికి సాయి శ్రీ డెవలపర్స్ కన్స్ట క్షన్ బాధ్యులు కమర్తపు శ్రీధర్ , ప్రముఖ న్యాయవాది జాబిశెట్టి పాపారావు , జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారుపల్లి సురేష్ , కాంట్రాక్టర్ తిరుమల రావు లు ముఖ్య అతిధులుగా హాజరువుతున్నట్లు చెప్పారు . ఈ కార్యక్రమం లో మంగళగిరి సిద్ధ వైద్యులు , గ్రాండ్ మాస్టర్ రెడ్ బెల్ట్ జి.వెంకట నరసయ్య ను తమ సంస్థ తరపున సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు . జీ.రవీందర్ వ్యాఖ్యతగా వ్యవహరించే ఈ కార్యక్రమం లో గాయని గాయకులు అంజాద్ పాషా , జనార్దన్ రావు , జాఫర్ , గణపతి రాజు , ప్రకాష్ , మాలతీ నాయుడు , కీర్తన , ఝాన్సీ తదితరులు తమ గానమాధురి తో అలరిస్తారని అన్నారు.

## యాత్రికులకు అన్నదానం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



**కాటారం, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** భూపాలపల్లి జిల్లా మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం లో అంగరంగ వైభవంగా జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు వస్తున్నటువంటి భక్తుల కోసం తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి వర్యులు దుద్దిళ్ళ శ్రీధర్ బాబు శ్రీను బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యం లో పుష్కర భక్తుల కొరకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు,కాటారం మండల కేంద్రంలో మహా అన్నదానం పలు ప్రదేశాలలో పులిహోర మరియు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. ఉచిత బస్ కల్పించడంతో ప్రజలు పుష్కర స్నాననికి తరలి వెళ్తున్నారు.పుష్కర యాత్రికులు అన్నదాత సుఖీభవ అంటూ దివిస్తున్నారు



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యం..

**• ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురాం రెడ్డి**

**• ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి సత్తుపల్లి, వేంసూరు మండలాల్లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత**





**సత్తుపల్లి, మే 23 (పీసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** అర్హులైన పేద వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో కలిసి శుక్రవారం సత్తుపల్లి లోని రాణి ఫంక్షన్ హాల్ లో, వేంసూరు లోని ఉన్నత పాఠశాలలో ఆవరణలో.. అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను అందజేశారు. సత్తుపల్లి పట్టణం లో 369 మందికి మరియు సత్తుపల్లి మండలం లోని అన్ని గ్రామాల వారీగా మొత్తం 581 మందికి, వేంసూరు మండలంలో 618 మందికి పేద కుటుంబ లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ..గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను పట్టించుకోలేదని అన్నారు. పదేళ్ళ పదవీకాలంలో కాలయాపన చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చాక.. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపును పేదలు ఒక పండుగలా చేసుకోగలుగుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో పలువురు అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## నాయి బ్రాహ్మణులకు గుర్తింపు కార్డుల పంపిణీ

**ఖమ్మం,మే23(పిసీడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):**గుర్తింపు కార్డు వ్యక్తి యొక్క వ్యక్తిత్వాన్ని,గుర్తింపు ను నిలబెడుతుందని నాయి బ్రాహ్మణ సంఘం నగర అధ్యక్షుడు యలమందల జగదీష్ అన్నారు. ఖమ్మం నగరంలోని బుర్హాన్ పురం నాయి బ్రాహ్మణ కాలనీలో గల సంఘ కార్యాలయంలో సంఘ సభ్యుల సమక్షంలో హాజరైన ప్రతి ఒక్కరికి గుర్తింపు కార్డును అందజేశారు.నగరంలో వివిధ హెయిర్ సెలూన్ లలో పనిచేస్తున్న నాయి బ్రాహ్మణులకు గుర్తింపు కార్డులను అందించటం వల్ల సంఘ సభ్యుడియొక్క వ్యక్తిత్వాన్ని మరియు గౌరవాన్ని పెంపొంచింప జేస్తుందని అన్నారు.సమాజంలో తనకంటూ ఓ గుర్తింపు ఉంటుందని తెలిపారు.ఇప్పటివరకు ఎక్కడా లేని విధంగా సంఘ సభ్యులకు గుర్తింపు కార్డులను ఇవ్వడంతో భవిష్యత్ లో నాయీ బ్రాహ్మణులకు అందాల్సిన సంక్షేమ ఫలాలు అందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు.సంఘ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని,మన ఉపాధి కోల్పోయేలా చేసి,నాయీబ్రాహ్మణుల జీవితాల్లో చీకట్లు నింపుతున్న కార్పొరేట్ హెయిర్ సెలూన్ లకు అడ్డుకట్ట వేసేంత వరకు వివిధ రాజకీయ,సామాజిక సంఘాల మద్దతు కూడగట్టుకొని ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## తాత్కాలిక మట్టి రోడ్డును పటిష్ఠం చేయాలి



**కాళేశ్వరం, మే 23 ( పిసిడబ్ల్యూ న్యూస్):** తాత్కాలిక మట్టి రోడ్డును ప మీకు ఒక తాత్కాలిక రోడ్డు మార్గాన్ని పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.సరస్వతి పుష్కరాలలో భాగంగా శుక్రవారం కాళేశ్వరంలోని గోదావరి నది ఒడ్డున ప్రధాన ఘాట్ నుండి సరస్వతి ఘాట్ వరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్ తో కలిసి పరిశీలించారు. సరస్వతి పుష్కరాలకి రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా వాహనాల రద్దీ పెరుగుతుందని, రవాణా చేసేందుకు అనువుగా తాత్కాలిక మట్టి రోడ్డును పటిష్ఠం చేయాలని తెలిపారు. అనంతరం టెంట్ సిటీని పరిశీలించి బురద, మట్టి లేకుండా స్టోన్ డస్ట్ వేసి టెంట్ లను పునరుద్ధరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ రమేష్, పంచాయతీ రాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, డిఈలు అవినాష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.తాత్కాలిక మట్టి రోడ్డును ప మీకు ఒక తాత్కాలిక రోడ్డు మార్గాన్ని పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.సరస్వతి పుష్కరాలలో భాగంగా శుక్రవారం కాళేశ్వరంలోని గోదావరి నది ఒడ్డున ప్రధాన ఘాట్ నుండి సరస్వతి ఘాట్ వరకు ఏర్పాటు చేసిన తాత్కాలిక మట్టి రోడ్డు ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్ తో కలిసి పరిశీలించారు. సరస్వతి పుష్కరాలకి రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్న దృష్ట్యా వాహనాల రద్దీ పెరుగుతుందని, రవాణా చేసేందుకు అనువుగా తాత్కాలిక మట్టి రోడ్డును పటిష్ఠం చేయాలని తెలిపారు. అనంతరం టెంట్ సిటీని పరిశీలించి బురద, మట్టి లేకుండా స్టోన్ డస్ట్ వేసి టెంట్ లను పునరుద్ధరించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ రమేష్, పంచాయతీ రాజ్ ఈఈ వెంకటేశ్వర్లు, డిఈలు అవినాష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో కరాటే విద్యార్థులకు ఘన సన్మానం

**• ముఖ్య అతిథులుగా పాల్గొన్న హుజురాబాద్ టౌన్ సిఐ టీ కరుణాకర్, టా ప్ర కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్**



**హనుమకొండ, మే 23 (పిసిడబ్ల్యూ న్యూస్):** హుజురాబాద్ పట్టణంలోని స్థానిక న్యూ కాకతీయ ఉన్నత పాఠశాలలో గ్లోబల్ ఫోటోకాన్ కరాటే డు అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో బెల్ట్ మెరిట్ టెస్టులో కరాటే విద్యార్థులు విజయం సాధించిన సందర్భంగా విద్యార్థులకు సన్మాన కార్యక్రమం నిర్వహించనైనది. ఇట్టి సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న హుజురాబాద్ టౌన్ సిఐ టీ కరుణాకర్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు చందుపట్ల జనార్ధన్, బెల్ట్ మెరిట్ టెస్టులలో విజయం సాధించిన విద్యార్థులను ఘనంగా సన్మానించినారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరాటే ను తన వృత్తిగా ఎంచుకొని ఎంతోమంది విద్యార్థుల ను తీర్చిదిద్దుతు వారి భవిష్యత్తుకు మంచి పునాది వేస్తున్న కృషీవలుడు కరాటే మాస్టర్ ఎస్కే జలీల్ ను మనస్ఫూర్తిగా అభినందించి నారు.కరాటే విద్యార్థులను మానసికంగా పరిపక్వత చెందునట్లు చేయడమే కాకుండా శారీరకంగా దృఢ పరుస్తుందని, అదేవిధంగా కరాటే పిల్లలలో ఆత్మ స్థైర్యాన్ని పెంపొందిస్తూ వారు సమాజంలోని ఏ సమస్యనైనా ఎదుర్కోవడానికి సంసిద్ధులుగా తీర్చిదిద్దుతుందని అన్నారు.ముఖ్యంగా ఆడపిల్లలు ధైర్యంగా ముందడుగు వేస్తూ తమను తాము రక్షించుకోవడానికి కరాటే దోహదపడుతుందని వారు విశ్వాసాన్ని వ్యక్తపరిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కొండా గణేష్,, అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు ఖలీద్ హుస్సేన్ ,ప్రైవేట్ కాలేజ్ ప్రిన్సిపాల్ పెండ్యాల రాజిరెడ్డి, కరాటే అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు అంబాల ప్రభాకర్ , బత్తుల రాజ్కుమార్, టి.గోపాల్, కరాటే మాస్టర్లు ఎస్కే జానీ,శ్రీనాథ్, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసినారు.

# నంబాల కేశవరావు బూటకపు ఎన్ కౌంటర్‌పై సుప్రీం కోర్ట్ జడ్జ్‌చే న్యాయ విచారణ జరిపించాలి

- బస్టర్ అడవుల్లో కేంద్ర పారా మిలిటరీ వెనక్కి పిలవాలి
- కగార్ ఆపరేషన్ వెంటనే నిలిపివేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సంఘీబావ వేదిక డిమాండ్

**పెద్దపల్లి, మే 23 (పీసిడబ్ల్యూ న్యూస్ ప్రతినిధి):** జిల్లా కేంద్రం అంబేద్కర్ విగ్రహం వద్ద మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాల కేశవ రావు బూటకపు ఎన్ కౌంటర్ ను నిరసిస్తూ, బూటకపు ఎన్ కౌంటర్ పై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జ్ తో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా విచ్చేసిన పౌరహక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి మాట్లాడుతూ రాజ్యాంగంలో జీవించే హక్కు పొందుపరిచి ఉన్నప్పటికీ భారత ప్రభుత్వం, దండకారణ్యంతో పాటు చత్తీస్ ఘడ్ అడవుల్లో కేంద్ర పారా మిలిటరీ బలగాలు ,డి ఆర్ జి , బలగాలు అడవిలో శోధన ఆపరేషన్ కగార్ తో ఎన్ కౌంటర్ లతో అడవుల్లో జీవించే ఆదివాసిలను మావోయిస్టుల పేర ఎన్కౌంటర్ చేయడం జీవించే హక్కు కాలరాయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వమే 2026 మార్చ్ నాటికి మావోయిస్టు విముక్తి భారత్ పేరుతో ఎన్కౌంటర్లను ప్రోత్సహిస్తూ రాజ్యాంగ ప్రజాస్వామ్య హక్కులను స్వేచ్ఛగా జీవించే హక్కును కాల రాస్తుందని, నారాయణపూర్ అడవుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర



ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో పాటు 27 మంది చనిపోవడం ఎన్కౌంటర్ పై పలు అనుమానాలు వ్యక్త అవుతున్నాయని అన్నారు. 2024 జనవరి 1 నుండి ఇప్పటివరకూ 525 మందిని ఎన్ కౌంటర్ లతో హత్య చేయడం హేమమైన చర్య అని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ తో శాంతి చర్చలు జరపాలని, మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంభాల కేశవ రావు బూటకపు ఎన్ కౌంటర్ సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జ్ చే న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాక్షిగా రాజ్యాంగంలో ఆర్టికల్ 21 జీవించే హక్కు తుంగలో తొక్కుతున్న మనువాద సర్కార్ బిజెపి సర్కార్, జిందాల్ మిట్టల్ ఆదని అంబానీ లకు ఆదివాసుల ఖనిజ సంపదను అప్పజెప్పిటకే ఈ బూటకపు ఎన్కౌంటర్లు ఆదివాసుల బతుకులతో చలగాటం, కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి మన భారత రాజ్యాంగాన్ని గౌరవించాలి , ఆదివాసి బతుకులు బాగు పడేలా చూడాలి... ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక రాష్ట్ర కో కన్వీనర్ మార్వాడీ సుదర్శన్(DLF), ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ ముడిమడుగుల మల్లన్న, పౌరహక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షులు బొంకూరి లక్ష్మణ్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు పార్టీ తో శాంతి చర్చలు జరపాలని, మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంభాల కేశవ రావు బూటకపు ఎన్ కౌంటర్ సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జ్ చే న్యాయ విచారణ జరిపించాలని, ఆదివాసీ ప్రాంతాల్లో సైనిక క్యాంపులను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విరసం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య,పౌరహక్కుల ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి రవి పౌరహక్కుల సంఘం సహాయ కార్యదర్శి రెడ్డిరాజుల సంపత్CLC ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు నారా వినోద్CLC ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షులు పుల్ల సుచరితరైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుకల రాజన్నతెలంగాణ ప్రజా ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య ప్రధాన కార్యదర్శి పులిపాక రవీందర్ జిల్లా ఉపాధ్యక్షులు గాండ్ల మల్లేశందళిత లిబరేషన్ ఫ్రంట్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ రామిళ్ల బాపుపౌరహక్కుల సంఘం EC సభ్యులు బండారి రాజలింగు, శ్రీపతి రాజగోపాల్, ప్రజా సంఘాల నాయకులు బండి శంకర్, మంచినీళ్ళ లింగన్న పాల్గొన్నారు

# గర్భిణి స్త్రీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

- గర్భిణీ స్త్రీలకు అందించే వైద్య సేవలపై రామగుండం మెడికల్ కళాశాలలో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్

**గోదావరిఖని: మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** గర్భిణి స్త్రీలకు ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం రామగుండం వైద్య కళాశాలను పరిశీలించి గర్భిణీ స్త్రీలకు అందించే వైద్య సేవలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రులలో అధికంగా ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. సాధారణ ప్రసవాల వైపు గర్భిణీ మహిళలను ప్రోత్సహించాలని, వారికి అవసరమైన కౌన్సిలింగ్ అందించాలని కలెక్టర్ తెలిపారు. మొదటి కాన్పులో సిజేరియన్ ఆపరేషన్లు వీలైనంత వరకు తగ్గించాలని కలెక్టర్ తెలిపారు. గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా 100శాతం పూర్తి చేయాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు టీకాలు పూర్తి స్థాయిలో వేయాలని, కాన్పుకు దగ్గరగా ఉన్న గర్భిణి మహిళలను ఆశా వర్కర్ల ద్వారా ఫాలో అప్ చేయాలని, పెయిన్



రాగానే సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం జరిగేలా చూడాలని కలెక్టర్ పేర్కొన్నారు. గోదావరిఖని వైద్య కళాశాలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రిలో సీనియర్ వైద్యులు అందుబాటులో ఉన్నారని, తీవ్రమైన కేసులకు సైతం ఇక్కడ చికిత్స అందించే అవకాశం ఉందని అన్నారు. అంతర్గాం, పుట్నూరు, గోదావరిఖని, రామగుండం పరిసర ప్రాంతాల్లో ఆశా వర్కర్ల ద్వారా జనరల్ ఆసుపత్రిలో ఉన్న వసతులను వివరిస్తూ ఇక్కడ అధికంగా ప్రసవాలు జరిగేలా చూడాలని, ప్రైవేట్ నర్సింగ్ హోమ్ లోకి వెళ్లి ప్రజలు డబ్బులు వృధా చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులలో టిఫా



స్కానింగ్ యంత్రం కూడా అందుబాటులోకి తీసుకొని వచ్చామని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని, ప్రతి నెల రామగుండం ప్రాంతంలో ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలపై ప్రచారం కల్పించాలని అన్నారు. గోదావరిఖనిలో నిర్మాణం జరుగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కళాశాలను సందర్శించి నిర్ణీత గడువు లోగా పూర్తి చేయాలని, శారదా నగర్ లోని నర్సింగ్ కళాశాలను సందర్శించి, తరగతి గదులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హిమ బిందు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, హెచ్. ఓ.డి.అరుణ, ఆర్.ఎం.ఓ డాక్టర్ రాజు, వైద్యులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పుట్ట మధువైఖరిని మార్చుకోవాలని హితవు పలికిన మైనార్టీ సెల్

**మంథని:మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** మాజీ జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ చేస్తున్న ఆరోపణలు సరికావని పెద్దపెల్లి జిల్లా మైనార్టీ సెల్ నాయకులు ఆరోపించారు.శుక్రవారం మంథని పట్టణంలోని మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జమీల్ అహ్మద్ ఆధ్వర్యంలో జిల్లా మైనార్టీ సెల్ సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో మైనార్టీ సెల్ పెద్దపెల్లి జిల్లా అధ్యక్షులు అక్బర్ ఆలీ,జమీల్ అహ్మద్ లు పుట్ట మధుకర్ మాట్లాడిన తీరుపై తీవ్రంగా ఖండించారు.గురువారం కాలేశ్వరంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడిన తీరు చూస్తే చాలా విడ్డురంగా ఉందని అన్నారు. మంథని ప్రజలు ఒక్కసారి ఎమ్మెల్యే గా తప్పుదారిలో ఆకాశం కల్పిస్తే ఇచ్చిన అవకాశాన్ని ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలు చేయక అవినీతి అక్రమాలకు పాల్పడి కోట్లాది రూపాయల ఆస్తులను సంపాదించుకొని అడ్డు వచ్చిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ దాడులకు ప్రేరేపించింది మీరు కాద అని విమర్శించారు.రాజకీయంగా వ్యక్తిగతంగా విమర్శలు ప్రతి విమర్శలు చేసుకోవాలి కానీ ఐఏఎస్ దేవదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్ పై వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని తప్పుడు ఆరోపణలు మానుకోవాలని తీవ్రంగా



హెచ్చరించారు.ఇప్పటికైనా పద్ధతి మార్చుకోకుంటే మైనారిటీలుగా మేమందరం మీయొక్క వ్యక్తిగత జీవితంలోకి రావాల్సి వస్తుంది జాగ్రత్త అని హెచ్చరించారు. మంథనిలో గతంలో ఎమ్మెల్యే గా పనిచేసిన చంద్రుపట్ల రాంరెడ్డి తన ప్రత్యర్థుల గురించి వ్యక్తిగత జీవితంగా ఎన్నడూ మాట్లాడలేదని రాజకీయ విమర్శలు చేశారని వారిని చూసి పుట్ట మధు నేర్చుకోని జ్ఞానోదయం కలగాలని అన్నారు.ప్రభుత్వం సరస్వతి పుష్కరాల కొరకు అధిక నిధులు కేటాయించి అంగరంగ వైభవంగా నిర్వహిస్తుంటే లక్షలాధి మంది భక్తులు వచ్చి పుష్కర స్నానాన్ని ఆచరిస్తున్నారు. పుష్కారాల దగ్గర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓర్వలేక దిగజారుడు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. కల్లు త్రాగిన కోతి లాగ తప్పుడు కూతలు కోస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేసుకుంటూ రాజకీయంగా పబ్బం గడుపుతూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్యాంసుందర్ ,కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి జనగామ నర్సింగరావు, ఎస్సీ సెల్ మంథని డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అజీమ్ ఖాన్,మైనారిటీ పట్టణ అధ్యక్షుడు ఏజాజ్,ముత్తారం మండల మైనార్టీ అధ్యక్షులు వాజిద్ పాషా ,వసియొద్దీన్ , యండివలి,యండి నజీర్,మహబూబ్ అంతర్జాతీయ అవార్డు గ్రహీత ఖాజా మొయినోద్దీన్, ఖాజా మజారోద్దీన్,మైనారిటీ సోదరులు పాల్గొన్నారు..

# నాలుగవ రోజుకు చేరిన ఉపాధ్యాయుల శిక్షణ

**జోగులాంబ మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ నాలుగవ రోజుకు చేరుకుంది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కోర్సు డైరెక్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో బయోలాజికల్ సైన్స్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నారు. ఈ సందర్భంగా కోర్స్ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 155



మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తుండగా 140 మంది హాజరవుతున్నారని మిగతావారు వివిధ కారణాలచే రాలేదని తెలిపారు. డిఆర్పీలు రవి కిరణ్, వీరన్న, రవిశంకర్ ఆధ్వర్యంలో బయోలాజికల్ సైన్స్ లో ఆరు నుండి పదవ తరగతి వరకు బోధించాల్సిన అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. అలాగే విద్యార్థులు ఫిజికల్ ఎడ్యుకేషన్ పై వారి శరీర దృఢత్వం, ఆరోగ్యం తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని ఆయన తెలిపారు.





# మానవత్వం చాటుకున్న వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

**హనుమకొండ, మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మరోసారి మానవత్వం చాటుకున్నారు. పరకాల పర్యటనలో భాగంగా హనుమకొండ నుండి పరకాల రోడ్డు మార్గంలో వెళుతూ.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని చూసి తన వాహనాన్ని నిలిపివేశారు. వరంగల్ ఎంపీ కడియం కావ్య స్వయానా ఒక డాక్టర్. రాజకీయ నాయకురాలు అనే కాదు డాక్టర్‌గా ఎందరికో వైద్య సేవలను అందించారు. తాజాగా ఆమెలో మరోసారి డాక్టర్ బయటికి వచ్చారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తులకు వెంటనే ప్రథమ చికిత్స చేసి అందరిచేత ప్రశంసలు అందుకున్నారు. దామెర మండలం, సైలని బాబా దర్గా సమీపన బైక్ యాక్సిడెంట్ జరిగింది. అటుగా వెళుతున్న పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య తన వాహనాన్ని ఆపి సంఘటన స్థలంలో జరిగిన ప్రమాదం గురించి ఆరా తీశారు. వెంటనే గాయపడిన వారికి ప్రథమ చికిత్స నిర్వహించి అంబులెన్స్ పిలిపించి, సమీప ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య ఇలా రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి సాయం చేయడం మొదటిసరేం కాదు. గతంలోనూ తన కాన్వాయ్‌ని ఆపి.. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ప్రథమ చికిత్స చేసి ఆసుపత్రికి తరలించారు.

# మొక్కలే మానవ మనుగడకు జీవనాధారం

**- మున్సిపల్ కమిషనర్ మనోహర్ గౌడ్**

**రాయికల్ మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):** మానవ మనుగడ సవ్యంగా సాగాలంటే మొక్కలే జీవనా ధారం అని రాయికల్ మునిసిపల్ క మిషనర్ మనోహర్ గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమృత్ 2.0 కార్యక్రమంలో భాగంగా ఉమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,చెరువు కట్టలపై,చెరువు కింద విరివిగా మొక్కలు నాటాలని,వాటి సంరక్షణ బాధ్యత మహిళా సంఘాల సభ్యులు తీసుకోవాలన్నారు. రానున్న వర్షకాలంలో మొక్కలను నాటి పచ్చదనంతో విరజిల్లేలా చూడాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరం తీసుకుందామని అన్నారు.అనంతరం మెప్మా ఆర్పిలకు మొక్కలు నాటే కిట్లను అందించారు.మెప్మా డీఎంసీ సునీత,సిఓ శరణ్య, మెప్మా ఆర్పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బోనాల పండగ

**రాయికల్ మే 23(పిసిడబ్ల్యూ న్యూస్):**రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో గంగమ్మ ఆలయంలో బోనాల పండుగ సందర్భంగా గంగమ్మ తల్లిని దర్శించుకున్నారు. మాజీ మంత్రి వర్యులు తాటిపర్తి జీవన్ రెడ్డి వారి వెంట. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజి రెడ్డి గారు మహేందర్ గౌడ్ మహిపాల్ రెడ్డి రాయికల్ మండల యూత్ కాంగ్రెస్ నాయకులు జక్కుల సాగర్. హనుమన్లు రాజిరెడ్డి మహేష్ సంతోష్ నర్సయ్య గంగపుత్ర సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

